ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
11 సెప్టెంబర్, 2011

స్నేహ

Entered

నిరాహార సమరం

హ్యాపీబర్త్‌డే

(2011 సెప్టెంబర్ 11 నుంచి
2011 సెప్టెంబర్ 17 వరకు)

ఆర్.యశ్వంత్(సన్నీ)
4సం॥, సెప్టెంబర్-2007
రమాదేవి-సైదులు
కట్టంగూర్-నల్లగొండ

జి.సాయి అభిరామ్
1సం॥, సెప్టెంబర్-16
భార్గవి-భగవాన్‌దాస్
నేరడ-నల్లగొండ

జి.ప్రణీత్
1సం॥, సెప్టెంబర్-17
జ్యోతి-రమేష్
కొలకలూరు-గుంటూరు

సాయి సిద్ధార్థ
సెప్టెంబర్-11
భద్రకాళి-రవి
నిజాంపేట-ఖమ్మం

వి.అక్షరస్నిగ్ధ
3సం॥, సెప్టెంబర్-11
ప్రవీణ-రజనీకుమార్
రేపల్లె-గుంటూరు

పి.గౌరవ్-గమన్
సెప్టెంబర్-16
గాయత్రి-గెల్వయ్య
అంబర్‌పేట్-హైదరాబాద్

సిహెచ్.సాయిచైతన్య
7సం॥, సెప్టెంబర్-16
విద్యుల్లత-లక్ష్మీనారాయణ
తాటికాయల-వరంగల్

స్నేహిత్
1సం॥, సెప్టెంబర్-13
నవనీత-రమేష్
హైదరాబాద్

ప్రబన్‌కుమార్
3సం॥, సెప్టెంబర్-2008
మంజులత-కుషాల్
అకునోనిపల్లి-మ॥నగర్

పి. నిఖిత
సెప్టెంబర్-12
పావని-కృష్ణగౌడ్
మోస్రా-నిజామాబాద్

ఎం. విజేందర్
3సం॥, సెప్టెంబర్-2008
పద్మ-శ్రీనివాస్
జమ్మిగడ్డ-హైదరాబాద్

ఇ.శృతి
సెప్టెంబర్-14
ఫణీంద్ర-వెంకటేశ్వర్లు
వరంగల్ ఎక్స్‌రోడ్డు- ఖమ్మం

శ్రావ్య
2సం॥ సెప్టెంబర్-2009
స్వాతి-శివ
సంజీవ్‌నగర్-రాజమండ్రి

కె. బాంధవ్య
3సం॥, సెప్టెంబర్-2008
రాధిక-కృష్ణమోహన్
రామకృష్ణాపురం-ప్రకాశం

త్రివిక్
5సం॥, సెప్టెంబర్-2006
వసంత-లక్ష్మణ్
విద్యారణ్యపురికాలనీ-కరీంనగర్

ఎం.స్ఫూర్తి
సెప్టెంబర్-16
లావణ్య-శోభన్‌బాబు
రుద్రారం-కరీంనగర్

మనలో మాట

విశ్వాసం



విశ్వాసం పలు విధాలు. విశ్వాసం అనగానే గుర్తొచ్చేది గ్రామసింహం. యజమాని పెట్టిన నాలుగు ముద్దలు తిని ఎంతో నమ్మకంగా ఇంటికి కాపలా కాస్తుంది. గోడమీద కాకి వాలినా గోలగోల చేస్తుంది. అనుమానాస్పద రీతిలో ఇంటిముందు సంచరించే వారినీ వదలదు. 'ఇదిరా... విశ్వాసమంటే' అనిపించుకుంటుంది.

కన్పించే యజమానిపై కుక్కకు విశ్వాసం. కన్పించని దేవుడిపై మానవుడికి విశ్వాసం. అగోచరుడు తమను కష్టాల్లో ఆదుకొంటాడని, కోరికలు తీర్చుతాడని మనిషి విశ్వాసం. ఎంతటి దేవుడయినా ఆమ్యామ్యాకు లొంగని వాడుండడని విశ్వాసం. కొందరు ఫలం, పుష్పం, తోయంతో సరిపెడతారు. కొందరు బంగారు కిరీటాలే చేయిస్తారు. పాపఫలంలో దేవుడికీ వాటా ఇచ్చేస్తే తమ జోలికి రాడని విశ్వాసం. దేవుడు అంత బరువు భరించలేడని శాస్త్రపండితుల విశ్వాసం. చరాచర ప్రపంచాన్ని మోసే భగవంతుడికి కిరీటం భారమా? భక్తుల సందేహం.

కొండకచో విశ్వాసం శృతి మించుతుంది. నంది చుట్టూ పంది తిరిగితే వరాహావతారమని విశ్వాసం. ఫలానా గుడికెళ్లి పూజ చేస్తే డొక్కు సినిమా కూడా జనానికి కిక్కెక్కిస్తుందని నిర్మాతల విశ్వాసం. పుట్టపర్తి సాయిబాబా అనారోగ్యానికి సత్తెమ్మ విగ్రహం తొలగించడమే కారణమని ఓ ట్రస్టు సభ్యుడి విశ్వాసం. గాలి కష్టాలకు సుంకులమ్మే అసలు కారణమని మరికొందరి విశ్వాసం. ఇలాంటి పుక్కటి పురాణాలు ప్రచురిస్తే, ప్రసారం చేస్తే తమకు రేటింగ్ పెరుగుతుందని మీడియా విశ్వాసం. సదానందుడు సందేహంలో పడితే దేశమంతా తమ కొంప ముంచుతుందని కమలనాథుల కలవర విశ్వాసం. నాగబంధం పేర అత్యున్నత న్యాయస్థానానికి సెంటిమెట్ బంధం వేయొచ్చని ఓ భక్తుడి విశ్వాసం.

డబ్బుతో 'విశ్వాసం' కొనేయవచ్చు, అమ్మేయవచ్చు. చట్టసభల్లో నిరూపిత విశ్వాసం. గనులను తెగబొక్కి బోనెక్కిన యజమాని కోసం ఒక ఎమ్మెల్యే రాజీనామా విశ్వాసం. మా నాయకుడి పేరును దర్యాప్తులో చేరుస్తారా అంటూ 29 మంది రాజీనామా లేఖల టోకు విశ్వాసం. భవిష్యత్తులో కలిసొస్తామంటే ఇప్పుడు కలిసొస్తుందేమోనని యువ నాయకుడి విశ్వాసం. ఈ ఎత్తుతో డొంక కదలకుండా పదవులు పోకుండా ఉంటుందేమోనని ప్రత్యక్ష, పరోక్ష విధేయుల్లో, అజ్ఞాత అక్రమార్కుల్లో పొడిచిన కొత్త విశ్వాసం.

✶

ఈ సంచికలో....

టపా	...	2
నవ్వుల్‌పువ్వుల్	...	3
కథ	...	6
రుచి	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
చిన్నకథ	...	18
కొత్తపుస్తకాలు	...	20
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

కవిత్వమ్ ... 4

వలస బతుకులు

సినిమా కబుర్లు ... 8

టాకీస్‌కు 80 ఏళ్లు మారిపోయిన మన వినోదం

వికాసం ... 19

ఒత్తిడి ఒదలాలంటే...

ఎవరిగోల వారిదే ... 21

ఇరవై ఏళ్లలో ఎంత మార్పు!!



అదొక్కటే కారణమా?

'పాపల పీక నులిమే పవిత్ర భూమి' వ్యాసం ద్వారా అనేక విషయాలు తెలిశాయి. బాలికల నిష్పత్తి తగ్గడం సమాజానికి ఆరోగ్యదాయకం కాదు. కొన్ని గిరిజన తెగల్లో ఆడ శిశువుల అమ్మకాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. వీటికి కారణం పేదరికం ఒక్కటే కాదు. కొన్ని ప్రాంతాల్లో భ్రూణహత్యలకు సామాజిక నేపథ్యమూ ఓ ప్రధాన కారణంగా ఉంటోంది. బిడ్డలు పుట్టడం భగవదేచ్ఛ కాదు. మానవ జీవశాస్త్ర పరిణామమని అందరికీ తెలియజేయాలి. చదువుకునే ఆడపిల్లలకు రాయితీలు, సంక్షేమ నిధులు ప్రభుత్వమే అందజేయాలి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

కౌబాయ్ అంటే ...

'వినాయక విలాసం – పర్యావరణం' అట్టమీది కథ ఉపయోగపడే సమాచారాన్ని సవివరంగా అందించింది. 'కొంచెం కెమిస్ట్రీ తెలుసుకుందాం' వ్యాసం సంబంధిత అంశాలతో చాలా ప్రయోజనకరంగా ఉంది. 'గతం గురుతులు' ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తుచేసింది. 'ఈ పేజ్ శీర్షికలో వచ్చే వెబ్‌సైట్ల పేర్లను ప్రతివారం భద్రపరుచుకుంటున్నాం. తమ్మెర రాధిక 'రమ్యమైన భోజనం' కమ్మగా ఉంది. దేవి అందించిన 'పాపల పీక నులిమే పవిత్ర భూమి' అందరినీ ఆలోచింపజేసేదిగా ఉంది. సినిమా కబుర్లలో అందించిన కౌబాయ్ వ్యాసం బాగుంది. కౌబాయ్ సినిమా అంటే హీరో కృష్ణే గుర్తొస్తారు. 'చూద్దామాలో' ఎల్లోరా గుహల గురించి సంపూర్ణ సమాచారాన్ని కళ్లకు కట్టినట్లు అందించినందుకు ధన్యవాదాలు. 'బాలనేస్తాలు'లో విహంగం శీర్షిక బాగుంటోంది. 'మాటల కోట' పదసంపద పెంచుతోంది. ఈవారం 'హ్హా... హ్హా...'లు బాగా తగ్గాయి. 'మనలో మాట'...లో చెప్పినట్టు ప్రజల బాగోగుల్ని సరిగా పట్టించుకోని ప్రభుత్వానికి 'వెంటిలేటర్' ఉంటే ఎంత? ఊడితే ఎంత?

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

అసలు కారణం అదే!

'ఎల్లోరా గుహలు' పుస్తకంలో చదివితేనే ఎంతో అందంగా ఉన్నాయి. చూస్తే మరెంత ఆనందంగా ఉంటుందో అనిపించింది. 'వినాయక విలాసం – పర్యావరణం' బాగుంది. రంగులు వేసేకంటే ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన మట్టి, గడ్డి, ఆకులతో వినాయకుడ్ని చేస్తే బాగుంటుంది. అసలు పురాణాల్లోకూడా మట్టితో, పిండితో, పసుపుతో చేసినట్లే చెబుతారు. రికార్డుల కోసం ఒకరి కంటే మరొకరు పెద్దవి చేసి, ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాదు పర్యావరణాన్ని కూడా పాడుచేస్తున్నారు. ఆనాటి కౌబాయ్ సినిమాలు ఇప్పుడు లేవు. నేటి సినిమాలన్నీ కొట్టుకోవడం, నరుక్కోవడం, వెగటు పుట్టే హాస్య సంభాషణతో ఉంటున్నాయి. 'పాపల పీక నులమడానికి మొదటి కారణం పెంపకంలో లోపమైతే, రెండోది సమాజంలో ఎదురౌతున్న పరిస్థితులు. పెద్దయ్యాక కట్నకానుకల బాధ, రక్షణ లేదనే కారణంతోనూ ఆడపిల్లల్ని ఇష్టపడడం లేదు. 'రమ్యమైన భోజనం' కథ బాగుంది. నేటి పిల్లలు చదువు, ఉద్యోగాల ధ్యాసలో పడి ఇంటి పనులు, వంట లాంటివేమీ నేర్చుకోవడం లేదు. దాంతో పెళ్లయ్యాక ఎన్నో ఇబ్బందులు పడాల్సొస్తుంది. అందుకే చిన్నప్పట్నుండే చదువుతో పాటు ఇంటి పనులు కూడా నేర్పుతుండాలి.

బొడ్డేపల్లి కనకలక్ష్మి,
ఆముదాలవలస.

వివరణ బాగుంది

'ఎవరి గోల వారిదే'లో కోటేశ్వరరావు వివరణ బాగుంది. ఇంటర్నెట్‌తో ఎక్కువగా పరిచయం లేని వారికి, తెలియని వారికి ఆన్‌లైన్ సినిమాలు, వాటి అడ్రస్సులు ఉపయోగకరంగా ఉన్నాయి. 'పులిరాజు' వంటి బాల కథలు పిల్లల్లో జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. 'బాలనేస్తాలు, మాటలకోట' అలరించాయి. 'రమ్యమైన భోజనం'లో సందేశం అస్పష్టంగా ఉందనిపించింది. 'పాపల పీక నులిమే పవిత్ర భూమి' వ్యాసం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేదిగా ఉంది.



సమాజంలో జరిగే సంఘటనలపై పరిశీలనా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడే స్ఫూర్తిని నింపింది ఈ వ్యాసం. చూద్దామాలో 'ఎల్లోరా గుహలు' కళ్లలో కదలాడుతున్నాయి. అట్టమీది కథ 'వినాయక విలాసం – పర్యావరణం'లో గణేష్ ఉత్సవాన్ని జరుపుకునే తీరులో వస్తున్న నూతన పోకడలు, ఫలితంగా పర్యావరణానికి ఏర్పడుతున్న ముప్పును రచయిత చక్కగా వివరించారు. అంతేకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు లౌకిక విధానంలో చెప్పడం బాగుంది. ఈవారం 'కొత్త పుస్తకాలు, బాలనేస్తాలు' బాగున్నాయి. నిత్యజీవితంలో ఉపయోగపడే కెమిస్ట్రీ గురించి అందించిన సర్వేశ్వరశర్మ వ్యాసం సమాచారదర్శినిగా ఉంది. అందరూ తప్పక తెలుసుకోవాల్సిన అనేక అంశాలు ఈవారం స్నేహలో ఉన్నాయి.

ఖైరి సత్యనారాయణ,
కొత్తగూడెం.



నవ్వుల్ - పువ్వుల్

సంతోషం

(సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మన్మోహన్‌సింగ్ ఒక హెలికాప్టర్‌లో వెళ్తున్నారు)

సోనియా గాంధీ: (ఓ వంద రూపాయలు తీసి ఫ్లైట్ లోనుండి కింద పడేసి) నేను ఒకరిని సంతోషపరిచాను.

రాహుల్ గాంధీ: (రెండు యాభై రూపాయల నోట్లు కింద పడేసి) నేను ఇద్దరిని సంతోషపెట్టాను.

మన్మోహన్ సింగ్: (వంద రూపాయి బిళ్లలు కింద పడేసి) నేను వంద మందిని సంతోషపెట్టాను.

పైలెట్: అలాగా...మీ ముగ్గుర్నీ కిందికి తోసేస్తే 120 కోట్ల మందిని సంతోషపెట్టినవాడినౌతానే!

నాలుగో పేపర్

టీచర్: ఎగ్జామ్ హాల్లో కనిపించే మూడు పేపర్లు ఏవి?

పిల్లవాడు: క్వశ్చన్ పేపర్, ఆన్సర్ షీట్, అడిషినల్ పేపర్ ...ఇంకా ...

టీచర్: ఇంకానా! అవేకదా!

పిల్లవాడు: కనిపించని నాలుగో పేపర్ వుంది మేడమ్. అదే ...చిట్టీ.

కిడ్నీ

డాక్టర్ : నీ కిడ్నీ ఫెయిలయింది.

పేషెంట్ : డాక్టర్! ఏమంటున్నారు మీరు? నేను ప్రతి రోజూ కాలేజీకి వెళ్తున్నానే. మరి ఎలా ఫెయిలయింది?

పేషెంట్ స్నేహితుడు : అదేరా అటెండెన్స్ సరిపోలేదేమో!

విజిల్

(గ్యాస్ స్టౌమీద ఓ దానిమీద పెనం, రెండో దానిమీద కుక్కర్ ఉన్నాయి)

పెనం : నన్ను పెళ్లి చేసుకుంటావా?

కుక్కర్ : ఛీ... నువ్వు చాలా నల్లగా ఉన్నావ్. నేను చేసుకోను.

పెనం : రాస్కెల్... మరి ఎందుకురా నన్ను చూసి విజిల్ వేశావ్?

మిస్డ్ కాల్

రంజిత్ : ఏంట్రా అలా ఫోన్ వైపే చూస్తున్నావు?

సురేష్ : ఏం లేదు. ఇందాక కస్టమర్ కేర్‌కి మిస్డ్‌కాల్ ఇచ్చాను. వాళ్ల ఫోన్ చేస్తారేమోనని చూస్తున్నా.

ఫార్వార్డ్

గోపాల్ : నిన్న నీ గర్ల్‌ఫ్రెండ్‌కి పెళ్లి చేసుకుంటావా అని మెసేజ్ పంపావుగా. ఏమంది?

గోవింద్ : ఎందుకడుగుతావ్‌లేరా? నా ఖర్మ. అది కూడా ఫార్వార్డ్ మెసేజ్ అనుకుని అందరికీ పంపింది.

జిరాక్స్

వెంగళప్ప : 5 తెల్ల పేపర్లు ఇవ్వండి.



షాపు యజమాని : 5 పేపర్లు లేవు. ఒక్కటే ఉంది.

వెంగళప్ప : పర్వాలేదు ఆ ఒక్కటే ఇవ్వండి. దాన్నే జిరాక్స్ తీయించుకుంటాను.

స్నేహ, హైదరాబాద్.

అసలు కిటుకు

వినోద్ : మీ అబ్బాయి పెళ్లి ఇంత త్వరగా ఎలా కుదిరింది?

రాజేష్ : మరేం లేదు. వివాహ ప్రకటనల్లో వరుడు ఇంటిపని, వంట పనిలో ప్రత్యేక అనుభవం కలవాడు అని వేయించా.

మార్పు

అహల్య : మీవారు ఈమధ్యే రిటైరయ్యారు కదా. నీకు వారిలో ఏమైనా మార్పు కన్పించిందా?



పార్వతి : ఆఫీసుకెళ్లేటప్పుడైతే వంట పని మాత్రమే చేసేవారు. ఇప్పుడు ఇంటి పని కూడా చేస్తున్నారు.

ఓ. శివరామకృష్ణ, విజయవాడ.

స్నేహం

గోపి : రాము! మీ ఇంట్లో పిల్లి, కుక్క స్నేహంగా ఉంటాయా?

రాము : మా చెల్లీ, నేనే స్నేహంగా ఉండం. ఇంక అవేం ఉంటాయి?

కె.ఎస్. శివరావు, జలూరు.

వలస బతుకులు

మా పల్లె కొసలు కొసలు
కత్తిరించిన మొగోని తలలెక్క
చింపిరి....
సందులు గొందులు పాపిట తీసిన
ఆడదాని నన్నెత్తి లెక్క
బిర్ర బిగుతు...
సెల్కలు సెత్త మొల్వక
ఎర్రని ఎండలు కాగుతున్నె
బీడు భూములు
బావురంట చతికల బడ్డయి
సూపు సాగినంత దూరం
తడి కానక పొగలు కక్కే నేలతల్లి
బుగబుగలు...
రోసం సచ్చిన ఎద్దుల
మెడకేసిన గడకొయ్యలు... చితికిన పల్లె చిత్రం
గిలాసడు పచ్చిపాలు చక్కరేసుకుని
తాగే పాలమీసాల పోరళ్లు లేరు
ఎండిన చెట్లకు ఏలాడే

పచ్చిగూళ్లు - జీవెగిరిపోయిన
బలాదూరు బలవంతులు.....
బోదురు కప్పలు అరవని బురద
కాలవలు...
చింతలు చచ్చిన ఊళ్లు
చింత చిగురాకు వేయని చెట్లు

చేదబావి సప్పుడు లేక తెల్లారని ఊళ్లు
ఎన్ని ఇద్దెలు పడినా
కన్నతల్లీ ఉన్న ఊరంటని
ఇస్తార్లకు ఎన్న బువ్వలేకున్నా
గల్మకు కట్టిన వడ్ల కంకులైనా
గరీబోని ఆకలి కతకు ముగింపు
పలుకుతయ్యేమో!
బతుకు దెరువుకేం ఎరుక
పేగు బంధాలుంటయ్యని!
అరిగిపోయిన యిసుర్రవుతులు
చిట్టిపోయిన కూరాటి కుండలు
జమిలిగ మా మెడలకు గుది బండలైనయి
వలసలు సాగుతున్న జీవిత చక్రంలో
ఒక్క పాలమూరేం ఖర్మ ఎన్ని దిక్కుల్నంచో
వలసలు బట్టి పోతునే ఉన్నరు
పానాల పల్లెల్ల బెట్టి
కడుపులు చేతల బట్టి

- తమ్మెర రాధిక

కవిత్వమ్

చేదు

మైనపు కత్తిని చూపి
ప్లాస్టిక్ 'డాల్'ను తిప్పి
గుర్తింపును అర్థిస్తూ
దొంగ నఖరాలక్కరలేదు

అట్టముక్క కిరీటం పెట్టుకుని
కాగితంపూల హారం వేసుకుని
పేడి మూతిమీది
లేని మీసాల్ని
మెలిపెట్టనక్కరలేదు

అరే భాయీ!
కవి అయినవాడు
కవిత్వం రాయాలి సార్!
ఫ్యాన్సీ డ్రెస్సు వేసుకోనక్కరలేదు

బ్యాండు బాజాలక్కరలేదు
పులి, పులిలా బతకాలి కాని,
పిల్లికి వేషం వేయనక్కరలేదు
ప్రచారం మత్తునిస్తుంది
జనం మనస్సుల్లో చోటివ్వదు

చాటింపులు వద్దు
దండోరాలు వద్దు
మనిషి కోసం
మంచి వాక్యం రాస్తే చాలు!
గోడలమీద పోస్టర్లక్కరలేదు
సంచారవాణిలో
సమాచారాలక్కరలేదు

- ఆశారాజు





కొవ్వొత్తి

సంధ్యాకాలం
నునులేత చీకటి
నెమ్మదిగా అల్లుకుంటోంది
కొద్ది సమయం
చేతుల్లోంచి జారిపోయాక
ఎంత చీల్చినా
ముక్కలు కాని చీకటి
శూన్య ప్రకంపనాల్ని విరజిమ్ముతోంది
ఇప్పుడు చీకటిని ఎదురీదే
మిణుగురులు సైతం
ఆత్మ ప్రబోధాన్ని
జ్ఞాన ప్రపంచాన్ని చూపిస్తున్నాయి
నాలో ఒక వేకువపిట్ట
వెలుగు రేఖల్ని
చిన్ని కొవ్వొత్తిగా
నిలుపుతుంది
అంతే
చీకటి వరదలు
ఆవిరవుతుంటాయి
చీకటి సంద్రంలో
మునిగిన దృశ్యాలు
కళ్లలో తెప్పలుగా
తేలియాడుతూ దర్శనమిస్తుంటాయి
కరిగిపోతున్నా...!
వెలుగు నవ్వుల సాక్షిగా
జీవితాన్ని ముగిస్తుంది ఈ కొవ్వొత్తి!

- గవిడి శ్రీనివాస్

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...

సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:

0-97890 99589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.**1000/-**లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

కొడుకుల్ బుట్టరటంచు...



ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్నభోజనం వండడం కోసం చేటలో బియ్యం చెరుగుతోంది మునెమ్మ. వంటగది పక్కనే ఎనిమిదో తరగతి గది ఉంది. అందులో నుండి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకంలోని

కొడుకుల్ బుట్టరటంచు నేడ్తు రవివేకుల్ జీవనభ్రాంతులై
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రున కనేకుల్? వారిచే నే గతుల్
వడసెన్? పుత్రులు లేని యాశుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్?
చెడునే మోక్షపదంబుపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా?

పద్యాన్ని రాగిణీ మేడం మధుర కంఠంతో శ్రావ్యంగా పాడి వినిపిస్తోంది. చేస్తున్న పని ఆపి శ్రద్ధగా వినసాగింది మునెమ్మ. "జీవితం మీది మోహంతో అవివేకులు కొడుకులు పుట్టలేదని ఏడుస్తారు. ధృతరాష్ట్రునికి చాలా మంది పుత్రులు పుట్టలేదా? వారి వల్ల అతడు ఏ గతులు పొందాడు? పుత్రులు లేని శుకునికి ఏ నరకం వచ్చింది. పుత్రులు లేని వారికి మోక్షం రాకుండా ఉండదు కదా! అన్న వివరణ విన్న మునెమ్మ 'ఆహా! ఎంత చక్కటి భావం. ఇదే పద్యం కనుక తను సరిగ్గా ముప్పై సంవత్సరాల కిందే వినుంటే కొడుకు కోసం ఏ మాత్రం ఆరాటపడేదాన్ని కాదేమో' అనుకుంది. బియ్యం చెరగడం పూర్తిచేసి కడిగి పొయ్యిమీద పెట్టింది. రాజమ్మ కూరగాయలు తీసుకురాగానే ఉప్పు నీళ్లలో వేసి కడిగి వాటిని కోసే పనిలో పడింది.

మాటల సందర్భంలో "మునెమ్మా! నీ కొడుకు కన్పించడం లేదు. ఎక్కడైనా పనికి కుదిరాడా?" అడిగింది రాజమ్మ.

"అవును. హైద్రాబాద్‌లో అపార్ట్‌మెంటు కడుతున్నారంట. పూర్తయ్యేదాక అక్కడే ఉండి పని చేయించాలని వెళ్లాడు" అబద్ధం చెప్పింది మునెమ్మ మరి ఇంకేం చెప్పగలదు? వాడి విపరీతబుద్ధిని సమర్ధించలేక, భరించలేక స్వయంగా మెడపట్టుకుని గెంటేశానని ఎలా చెప్పగలదు? అందుకే అలా చెప్పి తప్పించుకుంది. రాజమ్మతో కలిసి ఆమాటా ఈమాటా మాట్లాడుకుంటూ వంట ముగించింది. పిల్లలందరికీ పెట్టేసి ఇంటికి చేరుకుంది మునెమ్మ.

ఆమె వెళ్లేసరికి బోసి నవ్వులతో కాలివేళ్లను నోట్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది ఆర్నెల్ల మనవరాలు. కాళ్లగజ్జెలు ఘల్లుఘల్లుమని మోగుతుంటే, ఉయ్యాలకు కట్టిన పంచవన్నెల రామచిలుక బొమ్మను చూస్తూ తనలో తనే ఆ... ఊ.... అని చెప్పుకుని ఆడుకుంటున్న పసిదాన్ని చూసేసరికి అలసటంతా మరిచిపోయింది. తొట్టెలోని పసిబిడ్డని ఎత్తుకుని ఇంటి ముందు పందిరి కిందున్న మంచమ్మీద పడుకోబెట్టి, తనూ పక్కనే కూర్చుంది. అభం శుభం తెలీని ఆ చిన్నారి కేరింతలు చూసేసరికి అనుకోకుండానే ఆమె పెదవులమీద చిరునవ్వు విరిసింది.

ఆడపిల్ల అనే ఒకే ఒక్క కారణంతో తన కొడుకు శివుడు ఈ పిల్లమీద ఎంత కసి పెంచుకున్నాడు? ఆ కసితోనే 5 నెలల పసికందని కూడా చూడకుండా సంచిలో పెట్టి కాజీపేట రైల్వేప్లాట్‌ఫాం మీద వదిలిపెట్టడానికి కూడా వెనుకాడలేదు. ఛీ! వాడు తన కొడుకనుకోడానికే సిగ్గుపడాల్సొస్తోంది. ఇలా ఆలోచనల్లో ఉండగానే కోడలు ఉమ పెద్ద మనుమరాలిని తీసుకొచ్చింది.

"ఏడుస్తుందా అత్తయ్యా" అడిగింది కోడలు.

"అదేం లేదమ్మా! నేనే బయట బాగా గాలొస్తుందని తీసుకొచ్చాను. ఇంతకీ పెద్దదాన్ని డాక్టర్ దగ్గర చూపించావా? ఏమన్నారు? ఆస్పత్రిలో చాలా మందే ఉన్నట్టున్నారే?!" అంది.

ఇంటి ముందు కాస్తంత దూరంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వరుసగా జనాలు నిల్చున్నారు.

"అవునత్తయ్యా! వ్యాధులొచ్చేకాలం. ఏ కొంచెం అనారోగ్యంగా ఉన్నా పరీక్షలు చేయించుకోవాలని చెప్తున్నారు కదా. జనాలు బాగా వస్తున్నారు. దగ్గరే కదాని పాపని తీసుకెళ్లి చూపించానత్తయ్యా. పాపకి కొద్దిగా జ్వరం. నీరసంగా ఉందని, రెండు రకాల మాత్రలు ఇచ్చారు" అని చెప్పి చిన్నారి ఏడుస్తుంటే పాలివ్వడానికని తీసుకుంది.

మునెమ్మ పెద్ద మనవరాలిని ఎత్తుకుని "తిండానికి ఏం పెట్టమన్నారు?" అడిగింది.

"పండ్లు పెట్టి, పాలు, కొబ్బరి నీళ్ల తాగించమన్నారు. చెత్తా చెదారం లేకుండా, మురికి గుంటలు లేకుండా చూసుకోమన్నారు. దోమలు, ఈగలు రాకుండా చూసుకుంటే చాలా వరకు రోగాలు రావని చెప్పారు" అంది.

ఆప్యాయంగా మనవరాలి తల నిమురుతూ "శివుడు ఏమైనా ఫోన్ చేశాడా?" అడిగింది.

"లేదత్తయ్యా!" అని చిన్నారిని నిద్రపుచ్చడానికి లోపలికెళ్లింది. కోడలు ఇంట్లోకెళ్లడంతో మళ్లీ కొడుకు ఆలోచనల్లో పడింది.

◆◆◆

ఐదుగురు ఆడపిల్లల తర్వాత కొడుకు కావాలని, కనిపించిన చెట్టుకూ పుట్టకూ రాయికీ రప్పకూ మొక్కింది. ఆరవ సంతానంగా పుట్టిన కొడుకుని చూసుకుని మురిసిపోయింది. ఆడింది ఆట, పాడింది పాటగా, అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసింది. డిగ్రీ వరకు చదివించింది. నా అన్న వాళ్లెవరూ లేని దూరపుబంధువుల పిల్లని తెచ్చి పెళ్లి చేసింది. వాడూ అంతో ఇంతో సంపాదిస్తూ సంసారం సాగిస్తుంటే చూసి మురిసిపోయింది. కానీ వాడు మూర్ఖత్వాన్ని పెంచుకుంటున్నాడని ఊహించలేదు.

పెళ్లైన మొదటి సంవత్సరంలోనే పండంటి ఆడపిల్ల పుట్టడంతో వాడు కొంత నిరాశపడ్డాడు. తర్వాత కొడుకు పుడతాడనే ఆశతో ఏమీ మాట్లాడలేదు. కానీ కోడలు రెండోసారి నెల తప్పినప్పుడు కడుపులో ఉన్నది ఆడపిల్లా, మగపిల్లాడా అని పరీక్ష చేయించాడు. ఆడపిల్లని తెలీగానే బలానికని చెప్పి ఏవో మాత్రలు ఇచ్చి వేసుకోమన్నాడు. కడుపులో బిడ్డని కర్కశంగా కరగదీశాడు. కోడలుపిల్ల గుండెలు బాదుకుని ఏడ్చింది. మునెమ్మ కూడా కొడుక్కి ఎంతగానో నచ్చజెప్పి చూసింది. తిట్టింది. అయినా వాడికి దున్నపోతుమీద వాన కురిసినట్టే వుంది.

దీనంతటికీ కారణం స్కానింగ్ సెంటర్లని తెలుసుకుని, మహిళా సంఘాలతో వెళ్లి వాటిని మూసేయించారు కూడా. ఇది జరిగాక శివుడు కాస్త వెనక్కి తగ్గినట్లనిపించింది. మూడోసారి ఆడపిల్ల పుట్టినప్పుడు మాత్రం మొండిగా ఇంటికి రానన్నాడు. ఆ బిడ్డ ఇంట్లో ఉంటే తను వెళ్లిపోతానన్నాడు. తను కావాలో, ఆ బిడ్డ కావాలో తేల్చుకోమన్నాడు. అలా నెల రోజులు ఇంటిముఖం కూడా చూడలేదు.

కోడలుపిల్ల దుఃఖాన్ని చూడలేక ఆ దరిద్రుడ్ని ఇంటికి రప్పించాలనుకుంది. ఆరోగ్యం బాగాలేదు, పిల్లని పెద్దాసుపత్రికి తీసుకెళ్తున్నామని ఇరుగు పొరుగువారికి

చెప్పి అత్తాకోడళ్లు కలిసి హనుమకొండకు వెళ్లారు. అక్కడున్న శిశు సంరక్షణా కేంద్రం వారు ఏర్పాటు చేసిన 'ఊయల'లో అర్ధరాత్రి ఎవరూ లేనప్పుడు నిద్రపోతున్న బిడ్డని నిర్దాక్షిణ్యంగా ఉయ్యాలలో వదిలిపెట్టారు. నాలుగు రోజులు అక్కడ ఇక్కడ గడిపి ఇంటికి తిరిగొచ్చారు. ఊళ్లోవాళ్లు బిడ్డని అడిగితే ఆరోగ్యం బాగాలేక అక్కడే చనిపోయిందని చెప్పారు.

బిడ్డ శరణాలయంలో క్షేమంగా ఉందని తెలిసినా మమకారం చావక అప్పుడప్పుడు వెళ్లి చూసి వస్తున్నారు. ఇంత జరిగినా ఇదేమీ తెలియని, తెలుసుకోని కొడుకు పుట్టిన బిడ్డ చనిపోయిందనగానే ఇంటికొచ్చాడు. మునెమ్మకు మాత్రం ఇద్దరు బిడ్డల ప్రాణాలతో చెలగాటమాడిన నరరూప రాక్షసుడే కనిపించాడు కొడుకులో. ఇక నాలుగోసారి కూడా ఆడపిల్లే పుట్టింది. ఈ సారి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాడు. మొదట్లో బుద్ధిగా ఉండి ఐదు నెలల తర్వాత హఠాత్తుగా ఓ రోజు రాత్రి నిద్రపోతున్న బిడ్డను తీసుకెళ్లి కాజీపేట రైల్వే ప్లాట్ఫాంమీద వదిలేసి వచ్చాడు.

ఇదేమీ తెలీని అత్తాకోడళ్లు తెల్లారి బిడ్డను గురించి అడిగితే చావు కబురు చల్లగా చెప్పాడు. అప్పుడే మునెమ్మకి, కోడలికి అతనంటే అసహ్యం పుట్టింది. వెంటనే వెళ్లి అక్కడ వాకబు చేస్తే పోలీస్ స్టేషన్లో ఉందని తెలిసింది. ఇద్దరూ అక్కడికెళ్లి 'ఇంట్లో గొడవ పడి, తాగిన మైకంలో అలా చేశాడని' నచ్చజెప్పుకుని కాళ్లావేళ్లా పడి బిడ్డను ఇంటికి తెచ్చుకున్నారు. ఇదంతా ఊళ్లో తెలిస్తే పరువు పోతుందని ఈ రహస్యాన్ని గుట్టుగా కాపాడుకుంది. కానీ కొడుకులోని ఈ విపరీతమైన ప్రవర్తనని సహించలేకపోతోంది. ఓ రోజు "శివా! నువ్వెందుకిలా చేస్తున్నావు. ఒక్క కారణం చెప్పు? నీకు ఆడపిల్లలు చేసిన అన్యాయమేంటో...?" అంది అవేదనగా.

"ఇంకా ఏం చేయాలి? ఐదుగురు అక్కల కోసం ఆస్తినంతా హారతి కర్పూరం చేసి నాకేం మిగిల్చావని నేను ఆడపిల్లల్ని భరించాలి. పుట్టింది మొదలు పెళ్లి చేసేదాక అన్నీ ఖర్చులే. నరకయాతన పడాలి. ఇంత చేసినా ఒరిగేదేం లేదు. కొడుకుల్లా దగ్గరుండి చూసుకోరు. ముసలితనంలో తోడుండరు. అందుకే నేనెందుకు వాళ్లని గుండెల మీద కుంపటిలా మోయాలి?" అన్నాడు ఉక్రోషంగా.

ఈ మాటలు వినగానే ముప్పై ఏళ్ల కొడుకని కూడా చూడకుండా చెంప పగలగొట్టింది. "ఒరేయ్! నువ్వేదో వంశోద్ధారకుడవవుతావని మురిసిపోయాను. కానీ ఆడప్లిలల్ని పురిట్లోనే మట్టుపెడుతూ వంశానికి మచ్చ తెచ్చే చీడపురుగవుతావని ఊహించలేదు. నీలా నేను డిగ్రీలు చదువుకోలేదు. నాకున్నది పెద్ద బాలశిక్ష చదువైనా నీకున్న మూర్ఖత్వం లేదు. నారు పోసిన వాడే నీరు పోస్తాడనుకుని, మా కాలంలో ఏ

మాత్రం అక్షరజ్ఞానం లేకపోయినా ఆడ, మగ అని చూడకుండా ఎంతమంది ఆడపిల్లల్నైనా సాకాం. కానీ ఆకలిగొన్న రాక్షస పక్షుల్లా పిల్లల్ని చంపుకోలేదు. నాకు ఐదుగురు ఆడపిల్లలైనా ఏ మాత్రం జంకకుండా, మీ నాన్న లేకపోయినా భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసుకున్నాను. చేతనైనంత చదివించి బతుకు బాట చూపెట్టా. పెళ్లిళ్లు చేశా. ఇంతకంటే ఏం కావాలిరా? ఇప్పుడైతే ప్రభుత్వం కూడా ఆడపిల్లల కోసం విద్యా, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. అయినా ఆడపిల్లలు వద్దనే నీలాంటి మూఢులు ఉండడం మా దౌర్భాగ్యం. నీలాంటి నీచుడు అసలు పుట్టలేదనుకుంటాను. ముందు ఇంట్లోనుండి వెళ్లు" అని మెడపట్టి గెంటేసింది.

ఇదంతా అక్కడే నిలబడి చూస్తున్న కోడలు తనకు ఆసరాగా నిలబడిందే తప్ప మునుపటిలా బేలగా ఏడ్వలేదు. ఎందుకంటే తనూ ఆడపిల్లే కాబట్టి. ఈ మాత్రం ధైర్యం కోడలు తనకి ముందే ఇచ్చివుంటే ఇద్దరాడపిల్లలు అన్యాయమయ్యేవారు కాదనుకుంది.

గతమంతా ఒక్కసారి గుర్తుకు రాగానే కళ్లలో నీళ్లు తిరిగి రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి. సరిగ్గా అప్పుడే రెండు పళ్లాల్లో అన్నం తీసుకొచ్చింది కోడలు.

"ఏమైందత్తయ్యా! మీ అబ్బాయి గుర్తొచ్చాడా?" అంది పళ్లెం చేతికిస్తూ.

"లేదమ్మా! అలాంటి కొడుకుల వల్ల ఎంతమంది ఆడపిల్లలు బలవుతున్నారో కదా అని బాధేస్తోంది' అంది.

"అత్తయ్యా... ముందు అన్నం తిను. జరిగిన అన్యాయానికి ఏం చేయాలో అదే చేశాం" అంది స్థిరంగా.

కోడలి మాటలు కాస్త ఉపశమనం కలిగించినా, దీనికి శాశ్వత పరిష్కారం కనుక్కోవాలనే తపన అప్పుడే మొదలైంది. ఇంకేం మాట్లాడకుండా భోంచేసి కాసేపు నిద్రపోయింది.

◆◆◆

ఆ సాయంత్రం మహిళలకు గ్రామైక్య సంఘాల ద్వారా రుణాలు మంజూరయ్యాయని తెలిసి, తన గ్రూపు ఆడవాళ్లందరితో సంఘానికి చేరుకుంది. రుణాల గురించి మాట్లాడ్డం పూర్తయిన తర్వాత మునెమ్మ చెప్పడం మొదలుపెట్టింది.

"ప్రభుత్వం ఇస్తున్న రుణాలను పొందుతూ మన కుటుంబాలను మాత్రమే కాపాడుకుంటే సరిపోదు. ఆడపిల్లల మీద పెరుగుతున్న అత్యాచారాలు, భ్రూణహత్యలను ఖండిస్తూ కఠిన చర్యలు చేపట్టాలి. మన ఆడజాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. అందుకు ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆశపడకుండా, మన చుట్టుపక్కల ఎవరైనా అటువంటి నీచానికి పాల్పడితే నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకోకుండా వాటిని పరిష్కరించాలి. అది మనందరి బాధ్యత. దీనికి అందరం ఒకరికొకరం సహకరించుకోవాలి" అంది.

దూరంగా పసిబిడ్డకు అన్నం తినిపిస్తూ ఇందంతా వింటోంది ఉమ. ఆరు పదుల వయసులో కూడా ఏమాత్రం తొణక్కుండా కష్టపడే మనస్తత్వం, సమాజంతో ఏర్పరచుకున్న అనుబంధాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది. తోటివారిని అభివృద్ధి దిశగా నడిపించడానికి తన వంతు సాయంగా భావించే మునెమ్మలో ఒకప్పటి వీరవనితలు కనిపించారు. ఆమెకు తెలుసు. తన అత్తయ్య ఏదైనా పని తలపెట్టిందంటే అదయ్యేంత వరకు విడిచిపెట్టదు. మొన్నటికి మొన్న పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తామని, ప్రైవేటు పాఠశాలలకు పంపబోమని ప్రతిజ్ఞ చేయించింది. ఒకసారి ఎవడో ముక్కూమొహం తెలీనివాడు తమ ఊరి ఆడపిల్లపై అత్యాచారం చేయబోతే చెట్టుకు కట్టేసి అందరిచేత బుద్ధి చెప్పించి పోలీసులకి అప్పగించింది. అందుకే తను కూడా అత్తయ్య బాటలోనే ముందుకెళ్లాలని ఆలోచిస్తోంది. ఆ తెగింపు, పట్టుదలే తన పిల్లలకూ వారసత్వంగా రావాలని కోరుకుంటోంది.

ఇప్పుడు ఆ ఇద్దరి ఆరాటమూ ఒక్కటే. ఆడపిల్లల బతుకుల్లో వెలుగులు నింపి, జాతి మనుగడ పోరాటం మొదలెట్టడం. కట్న కానుకల ఆచారాన్ని చంపలేక ఆడపిల్లల్నే చంపే చేతకాని భర్తకోసం ఎదురు చూడడం లేదు ఉమ. సుపుత్రుడు దూరమయ్యాడని ఏమాత్రం బాధ పడట్లేదు మునెమ్మ. ఇప్పుడు వారిద్దరి లక్ష్యం ఒక్కటే. ఆ ఊళ్లో అజ్ఞానాంధకారం తొలగించి విజ్ఞాన జ్యోతి వెలిగించడం.

- రావుల కిరణ్మయి

అనంత కాలగతిలో ఎనభై ఏళ్ళనేది ఓ చిన్న పరిమాణమే కావచ్చు. కానీ, కేవలం కొన్ని దశాబ్దాల క్రితమే కొత్తగా మొదలైనా, తరువాత కొన్నేళ్ళకే విస్తారంగా పెరిగి, సమాజంపై గణనీయమైన ప్రభావం చూపిన విజ్ఞాన ఆవిష్కరణకు మాత్రం ఎనిమిది దశాబ్దాలు పెద్ద కాల వ్యవధే! అందుకే, మన దేశంలో, మన భారతీయ భాషల్లో వెండితెర మీద బొమ్మలు మాట్లాడడం మొదలుపెట్టిన 1931 నుంచి ఇప్పటికి 80 ఏళ్ళు పూర్తి కావడం ఓ కీలకమైన మజిలీ. తొలి భారతీయ టాకీ 'ఆలమ్ ఆరా' (విడుదల 1931 మార్చి 14)కీ, తొలి బెంగాలీ టాకీ 'జమాయ్ షష్ఠి' (1931 ఏప్రిల్ 11)కీ, తొలి దక్షిణ భారతీయ భాషా (తమిళ) టాకీ 'కాళిదాస్' (1931 అక్టోబర్ 31)కీ, తొలి పూర్తి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' (చిత్ర నిర్మాణం - 1931)కీ 80 వసంతాలు జరుపుకొంటున్న వేళ అప్పటి చిత్ర నిర్మాణం, ప్రచారం, ప్రదర్శన పద్ధతులు, జనంలో కనబడిన ఉత్సాహ ఉద్వేగాల కథలు, కబుర్లు మీ కోసం...



మొదటి తెలుగు టాకీ భక్త ప్రహ్లాద

టాకీస్‌కు 80 ఏళ్ళు
మారిపోయిన మన వినోదం

మాట్లాడడం మాట దేవుడెరుగు, అసలు తెరపై బొమ్మలు కదలడమే ఓ వింత! ప్రపంచ దేశాలన్నిటి లాగానే మన దేశంలోనూ తొలి రోజుల్లో సినిమా ఓ పెద్ద వింత. అప్పటి దాకా కథా కాలక్షేపాలు, నాటకాల లాంటి వాటికే పరిమితమైన జన వినోదం, విరామ జీవితం కాస్తా తెర మీద బొమ్మల కదలికతో ఒక్కసారిగా మారిపోయింది. అప్పటి వరకూ జానపద కళారూపాలు, రంగస్థల నాటకాలు, నటీనటుల పాటలు, పద్యాల గ్రామఫోన్ రికార్డులే జనానికి వినోద సాధనం. ఆ సమయంలో సినిమా ఆవిర్భావంతో, ఈ తెర మీద కదిలే బొమ్మల ప్రదర్శన కోసం సంచార సినిమా కేంద్రాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత సినిమా హాళ్ళ నిర్మాణం సాగింది.

ఆనాటి సినీ ప్రచార పద్ధతులు

నిజానికి, తొలి రోజుల్లో ప్రత్యేకంగా సినిమా హాళ్ళు నిర్మించడమంటూ లేదు. నాటకశాలలే సినిమా ప్రదర్శనలకు చోటిస్తూ, క్రమంగా శాశ్వత సినిమాహాళ్ళుగా మారాయి. అలా ఆంధ్రదేశంలో మొట్టమొదటి సినిమా థియేటర్ – బెజవాడ (ఇప్పటి విజయవాడ)లోని 'శ్రీమారుతీ' హాలు (ఇప్పుడిది వాణిజ్య భవన సముదాయంగా మారింది). 1921లో పోతిన శ్రీనివాసరావు దీన్ని నిర్మించారు. 1921 అక్టోబర్ 23న ఆ హాలు ఆరంభమైంది. ఆ మూకీ చిత్రాల నాటికి రవాణా సౌకర్యాలు ఇంతగా లేవు. అప్పటికి సినిమా పంపిణీ వ్యవస్థ కూడా ఇప్పటిలా ఉండేది కాదు. సినిమాలకు ఫలానా ప్రాంతానికి ఫలానావాళ్ళు హక్కుదారులు, ఫలానా వాళ్ళు పంపిణీదారులనే పద్ధతి లేదు. థియేటర్ యజమానే అన్నీ చూసుకొనేవాడు. సినిమాలను ప్రదర్శించాలంటే కలకత్తా, బొంబాయి లాంటి నగరాలకు వెళ్ళి, వాటిని కొనుక్కుని రావాల్సిందే! కష్టమొచ్చినా, నష్టమొచ్చినా ఆ భారమంతా హాలు యజమానిదే! అప్పటికి మన దేశంలో తయారయ్యే చిత్రాలు కూడా ఇప్పటితో పోలిస్తే చాలా తక్కువే. విదేశీ ఆంగ్ల మూకీలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. అందుకే, అప్పట్లో 'శ్రీమారుతీ'తో సహా అన్ని హాళ్ళలో అందుబాటులో ఉన్నదాన్ని బట్టి మూకీ సినిమాలు, లేదంటే అదే హాలులో నాటకాలు ప్రదర్శించేవారు. మాటలుండని ఈ మూగ సినిమాల గురించి హాల్లోని ప్రేక్షకులకు వివరంగా చెప్పడానికి మంచి వ్యాఖ్యాతను పెట్టేవాళ్ళు. వ్యాఖ్యాతతో పాటు హాలు లోపల మధ్యలో ఓ వేదిక లాంటిది ఏర్పాటు చేసుకొని, హార్మోనియమ్, తబలా పెట్టుకొని, తెర మీద వచ్చే దృశ్యాల్లోని భావోద్వేగాలకు తగ్గట్లుగా వాయించేవారు. సినిమాల పబ్లిసిటీ కూడా నాటకాల ఫక్కీలోనే ఉండేది. సినిమా గురించి, అందులోని విశేషాల గురించి రాసి, కరపత్రాలు అచ్చు వేయించి, నౌబత్ (ఢంకా) పెట్టుకొని, ఆ కరపత్రాలు పంచుకొంటూ ప్రచారం చేసేవారు. థియేటర్లలో మేళతాళాలు పెట్టేవారు. కొత్త చిత్రం విడుదలవుతున్న రోజున మనుషులతో చిత్రవిచిత్రమైన రకరకాల వేషాలు వేయించి, బళ్ళ మీద నిలుచోబెట్టి, బ్యాండు మేళాలతో ఊరేగించేవారు.

సినిమాకొస్తే సోడా.. కిళ్ళీ!

పోతిన శ్రీనివాసరావే స్వయంగా ఆనాటి సంగతులు ఒకసారి చెబుతూ, 'అప్పట్లో పోస్టర్లు రాలేదు. పబ్లిసిటీ కోసం కరపత్రాలు పంచిపెట్టేవాళ్ళం. 'సినిమాకు వచ్చేవాళ్ళకు ఇంటర్వెల్‌లో సోడా, కిళ్ళీ ఉచితంగా ఇస్తాం' అని ప్రకటించేవాళ్ళం. దానివల్ల కొన్ని టికెట్లు అమ్ముడయ్యేవి' అని వివరించారు. అలాగే, జనాన్ని హాలుకు రప్పించడం కోసం మూకీ చిత్రాల్లో నటించిన బొంబాయి తారలను పిలిపించి, సినిమా ఆడుతూ ఉండగా ఒక రీలు తరువాత మరొక రీలు మార్చుకొనేటప్పుడు మధ్యలో ఉండే వ్యవధిలో వాళ్ళతో డ్యాన్సులు చేయించేవారు. ఇలాంటి హంగులన్నీ ఉండి, కథ వివరించే వ్యాఖ్యాత చేసే వ్యాఖ్యానం సరదాగా ఉంటే జనం బాగా వచ్చేవారు. జి.వి.ఎస్. శాస్త్రి, తరువాతి రోజుల్లో హాస్యనటుడిగా పేరు తెచ్చుకున్న కస్తూరి శివరావు చక్కటి చమత్కారాలతో వ్యాఖ్యానం చెబుతూ, ప్రేక్షకుల్ని నవ్వించేవారు. "తదనంతర కాలంలో ప్రముఖ నటుడిగా వెలిగిన ముదిగొండ లింగమూర్తి సైతం అప్పట్లో గుడివాడలోని 'మారుతీ మరీదు' (ఇప్పటి 'గౌరీశంకర్') హాలులో మూకీ చిత్రాలకు వ్యాఖ్యాతగా, కథా కథకుడిగా పనిచేయడం కళ్ళారా చూశాను" అని ఈ సెప్టెంబర్ 19తో 93వ ఏట అడుగు పెడుతున్న తొలి తరం సినీ పత్రికా రచయిత మద్దాలి సత్యనారాయణ శర్మ (ఎమ్మెస్ శర్మ) గుర్తు చేసుకున్నారు. ఇలా వ్యాఖ్యానం చెబుతూ, కథను వివరించే పద్ధతి మూగ చిత్రాలకే కాదు, తెర మీద బొమ్మలు మాట్లాడడం మొదలైన తరువాత ఆంధ్రదేశంలో విడుదలైన హిందీ, తమిళ తదితర పరభాషా టాకీలకూ కొనసాగింది.

అడుగడుక్కీ విశ్రాంతి
అమావాస్య నాడు కొత్త సినిమా

మూకీ చిత్రాలు ఆడే రోజుల్లో ఆంధ్రదేశంలో చాలా చోట్ల కరెంటే లేదు. దాంతో, ఆయిల్ ఇంజన్ల ద్వారా కరెంట్‌ను ఉత్పత్తి చేసేవారు. ఆ ఇంజన్ నడపడానికి డ్రైవర్ కావాలి. అలాగే, అప్పట్లో ప్రొజెక్టర్‌లోని రీలును చేతితో తిప్పేవారు. అలా ప్రొజెక్టర్‌ను తిప్పడానికి ఆపరేటర్ కావాలి. ఇక, హాలులోని ప్రేక్షకులకు కథ చెప్పడానికి వ్యాఖ్యాత సరేసరి! ఈ ముగ్గురూ ఉంటేనే, సినిమా హాలు,

అందులో చిత్ర ప్రదర్శన నడిచేది!! ప్రొజెక్టర్ల గురించి మరిన్ని వివరాలకు వస్తే, అప్పట్లో హాళ్ళలో ఇప్పటిలా రెండేసి ప్రొజెక్టర్లు ఉండేవి కావు. ఒకటే ప్రొజెక్టర్. స్పూల్‌లోని రీలు అయిపోగానే ఆపి, లైట్లు వేసి, రీలు మార్చేవారు. పైగా, రీళ్ళుండే గుండ్రటి స్పూల్స్ కూడా చిన్నవే. దాంతో దాదాపు ప్రతి పావుగంటకు ఒకసారి రీలు మారుస్తున్నప్పుడల్లా ఓ ఇంటర్వెల్లే! ఆ తరువాత కొన్నాళ్ళకు బవర్ ప్రొజెక్టర్ వచ్చేసరికి, రీళ్ళుండే స్పూల్స్ పెద్దవయ్యాయి. అప్పటి నుంచి అయిదారు రీళ్ళు కలిపి ప్రదర్శించేవారు. అంటే ఇంటర్వెల్స్ సంఖ్య కొంత తగ్గింది. ఆ తరువాతి రోజుల్లో ప్రతి హాలులో చిత్ర ప్రదర్శనకు రెండు ప్రొజెక్టర్లు వచ్చాయి. అప్పటి నుంచి సినిమా మధ్యలో ఒకే విశ్రాంతి సమయం ఇవ్వడం మొదలుపెట్టారు. ఇక, చలనచిత్రాలు వచ్చిన గత శతాబ్దపు తొలి దశకాల్లో ఇప్పటిలా ఆదివారం సెలవు ఉండేది కాదట! అమావాస్యకు మాత్రమే సెలవు. ఆ రోజున వ్యాపారస్తులందరూ తమ దుకాణాలు మూసివేసేవారు. ఆ సెలవు రోజున సినిమాకు జనం బాగా వచ్చేవారు. అందువల్ల అమావాస్య రోజున కొత్త చిత్రాలు విడుదలయ్యేవట! ఆ తరువాత క్రమంగా సెలవు ఆదివారానికి మారింది. దాంతో, సాధారణంగా సినిమాల విడుదలలన్నీ శనివారం నాడు జరిగేవి. ఆదివారం సెలవు కావడంతో, శనివారం కొత్త సినిమా వేస్తే, మొదటి ఆట మొదలయ్యే సాయంత్రం 6.30 గంటల సమయానికల్లా పనులు ముగించుకొని, జనం బాగా వస్తారని ఓ అంచనా. (శుక్రవారం నాడు కొత్త సినిమా విడుదలవడమనేది ఆ తరువాత రోజుల్లో వచ్చిన సంస్కృతి). అప్పట్లో ఇప్పటి లాగా రోజూ మూడేసి, నాలుగేసి ఆటలు ఉండేవి కావు. రోజూ రెండు ఆటలే! మొదటి ఆట (ఫస్ట్ షో) సాయంత్రం 6 - 6.30 గంటలకు! రెండో ఆట (సెకండ్ షో) రాత్రి 9 - 9.30 గంటలకు! అంతే! మధ్యాహ్నం ఆటలు (మ్యాట్నీలు) కానీ, ఉదయం ఆటలు (మార్నింగ్ షోలు) కానీ మొదట్లో లేవు. ఆ తరువాత క్రమంగా ఆదివారాల్లో, పండుగలు, పర్వదినాల్లో ప్రత్యేకంగా మ్యాట్నీలు, ఉదయం ఆటలు వేసేవారు. టాకీలు వచ్చిన కొన్నాళ్ళ తరువాత రోజూ మ్యాట్నీ షోల ప్రదర్శన స్థిరపడింది. మూకీల నాళ్ళ మొదలు టాకీలు వచ్చాక కూడా చాలా కాలం సినిమా హాళ్ళలో మూడే తరగతులు - నేల, బెంచీ, కుర్చీ! "కనీస టికెట్ అర్ధణా! (అంటే దాదాపు మూడు పైసలనుకోవచ్చు). ఆ టికెట్ కొంటే చాలు, అచ్చంగా నేల మీద, ఇసుకలో కూర్చొని సినిమా చూసేయచ్చు" అని ఎమ్మెస్ శర్మ నవ్వేశారు. నగరాల్లో అయితే, మూకీల రోజుల్లో నేల టికెట్ - అణా, బెంచీ - రెండు అణాలు, కుర్చీ - నాలుగణాలు (అంటే పావలా)! టాకీలు వచ్చేటప్పటికి టికెట్ రేట్లు పెరిగాయి. బేడా, పావలా, అర్ధరూపాయి

హెచ్.ఎమ్.రెడ్డి, అర్దేషిర్ ఇరానీ, పి.వి. దాస్

అయ్యాయని అప్పటి సంగతులు తెలిసినవారు చెబుతారు. ఆ రోజుల్లో టికెట్ల కోసం క్యూలో నిలబడే పద్ధతులు కూడా లేవు, తెలియవు. టికెట్లిస్తున్న కౌంటర్ దగ్గర గుమిగూడడం, బలం ఉన్న వాడిదే రాజ్యంగా టికెట్లు సంపాదించుకోవడమే! "ఆ తరువాత రెండో ప్రపంచ యుద్ధం నాటికి కానీ, ఓ నిర్దిష్టమైన క్యూ పద్ధతి రాలేదు" అని ఎమ్మెస్ శర్మ చెప్పుకొచ్చారు.

మూకీ చిత్రాల ముచ్చట్లు

'ఆంధ్రపత్రిక'లో దీర్ఘకాలం పనిచేసిన వయోధిక జర్నలిస్టు ఎమ్మెస్ శర్మకు తన చిన్ననాటి సంగతులూ, సినిమా ఇంకా మాటలు నేర్వని ఆ రోజుల్లో తాను చూసిన మూకీ చిత్రాలూ బాగా జ్ఞాపకమే! "అప్పట్లో మా గుడివాడలో రెండే సినిమా హాళ్ళుండేవి. ఒకటి - 'మారుతీ మరీదు', రెండోది - శ్రీనివాస సినిమా హాలు. మొదటిది మా ఇంటికి దగ్గరలో, రెండోది కొంచెం దూరంలో ఉండేది. కృష్ణాజిల్లా బంటుమిల్లి దగ్గర నీలిపూడి గ్రామానికి కరణీకం చేసే మా మేనమామ ఎప్పుడొచ్చినా, సినిమాలకు తీసుకెళ్ళేవాడు. 'అక్కయ్యా! మొదట ఆ హాలుకు వెళ్ళి వచ్చి, రెండో ఆటకు ఇక్కడకు వెళతాం' అని మా అమ్మతో చెప్పేవాడు. రెండు సినిమాలకూ ఇవాళే ఎందుకు? రేపు వెళ్ళొచ్చుగా' అని మా అమ్మ అంటే, 'లేదులే! పొద్దున్నే ఊరెళ్ళిపోవాలి' అనేవాడు. అప్పట్లో జనంలో సినిమాలంటే అంత పిచ్చి ఉండేది. అలా ఆయనతో అక్కడ బోలెడన్ని మూకీ సినిమాలు చూశా" అని కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని కలవపాముల గ్రామంలో జన్మించిన ఎమ్మెస్ శర్మ చెప్పుకొచ్చారు. అప్పటికి సినిమాలకు ఇంకా మాటలు, పాటలు రాలేదు. మాస్టర్ విఠల్, గణపతి, ఈశ్వర్, ఈనాందార్, దీక్షిత్, మాధురి, సులోచన, గోహర్, రామ్‌ప్యారీ వగైరా నటించిన ఆ 'మూగ' సినిమాలు, వారి పేర్లు, కొన్ని సినిమాల పేర్లు కూడా ఇంకా శర్మ మనస్సులో నిలిచి ఉన్నాయి. మూకీల్లో ప్రముఖ తారలైన విఠల్, గణపతి చేసే కత్తి యుద్ధాలు, ముష్టి యుద్ధాలు, నటుడు ఈనాందార్ కర్రసాములు, రామాయణంలోని వివిధ ఘట్టాలతో వచ్చిన సినిమాలు, టార్జాన్ చిత్రాలు కూడా ఆయనకు జ్ఞాపకమే! "ఆ సంవత్సరం అలా ఆ మామయ్యతో ఓ యాభై, అరవై సినిమాలు చూసి ఉంటాను. పృథ్వీరాజ్, ఎర్మిలైన్ నటించిన 'పాసింగ్ షో' చిత్రం వచ్చిన తరువాత, ఆ పేరుతోనే సిగరెట్ పెట్టెలు రావడం నాకు బాగా జ్ఞాపకం" అని శర్మ చెప్పారు.

సామాన్య జనంలో సినిమా మోజు

అప్పట్లో జనానికి సినిమా మీద ఎంత క్రేజంటే, "గుడివాడ లాంటి ప్రాంతంలో పిల్లలు మూకీ చిత్రాల నటుడు విఠల్ క్రాఫ్ అంటూ జుట్టు వెనక్కి దువ్వుకొనేవారు. మరో మూకీ నటుడైన గణపతి క్రాఫ్ అంటూ అతణ్ణి అనుకరిస్తూ జుట్టు విరబోసుకొనేవారు. పిల్లలు ఒకరితో ఒకరు 'నువ్వు విఠల్‌వి, నువ్వు గణపతివి' అని పిలుచుకుంటూ, సరదాగా ఫైటింగులు చేసుకొనేవారు. ఆ రోజుల్లో ఈనామ్‌దార్ అనే మూకీ నటుడు కర్రసాముకు ప్రసిద్ధి. పిల్లలం అతణ్ణి అనుకరిస్తూ, ఆడుకొనేవాళ్ళం. అలాగే, సీరియల్స్‌గా ఒక్కో భాగం వంతున ప్రదర్శించే 'టార్జాన్' సైలెంట్ ఫిల్ములు చూసి, ఊడలు పట్టుకొని ఊగేవాళ్ళం" అని శర్మ వివరించారు. నిజానికి, 1921 - 25 మధ్య కొన్ని సినిమాహాళ్ళు నిర్మాణమయ్యాయి. జనాకర్షణ చూసి, 1928 - 29 ప్రాంతంలో అనేక పట్టణాల్లో వడ్ల గోదాములు చిత్ర ప్రదర్శన శాలలు మారాయట! రెండేళ్ళు తిరగక ముందే దాదాపు 70 హాళ్ళు వెలిశాయి. బందరులో పి.వి. దాసు (1925లో 'మినర్వా' థియేటర్), ఏలూరులో మోతే కృష్ణారావు (పాండురంగ సినిమా), విశాఖపట్నంలో జి.కె. మంగరాజు (1930లో శ్రీకృష్ణా సినిమా'గా సి. పుల్లయ్య భాగస్వామ్యంలో మొదలై, తరువాత 'పూర్ణా' థియేటరైంది), బళ్లారిలో గోపాలరావు (స్టార్ సినిమా), రాజమండ్రిలో నిడమర్తి సోదరులు (1924లో 'శ్రీకృష్ణా పిక్చర్ ప్యాలెస్'గా మొదలై, ఇప్పటికీ 'శ్రీసాయికృష్ణా' ఏ.సి.గా నడుస్తోంది) సినిమా హాళ్ళు కట్టారు. విజయవాడలో రెండో హాలుగా, తమ 'శ్రీదుర్గాకళామందిరం'లో సినిమాలు ప్రదర్శించడం మొదలు పెట్టాక, 'ఆంధ్రపత్రిక' సినిమా ప్రకటనలు వేస్తూ వచ్చింది. క్రమంగా పత్రికల్లో సినిమాల వాణిజ్య ప్రకటనల ప్రచురణ, కొద్దిగా వాటి గురించి వార్తలు వేయడం మొదలైంది. మూకీ సినిమాల పట్ల ప్రజలు ఆదరణ చూపించారు. అయితే, తెర మీద ఏదో బొమ్మలు పరిగెడుతూ ఉన్నాయి తప్ప, మాటలు, పాటలు లేవనే అసంతృప్తి కొంత ఉండేది. దాంతో, మూకీ చిత్రాల పట్ల జనాదరణ క్రమేపీ తగ్గిపోతూ వచ్చింది. ఆ సమయంలో 1931 మార్చి 14న భారతదేశపు మొదటి టాకీ చిత్రం 'ఆలమ్ ఆరా' విడుదలైంది.

(మరిన్ని వివరాలు పైవారం)

- రెంటాల జూనియర్

టెలికాం రంగంలో సంచలనం సృష్టిస్తున్న నూతన ఆవిష్కరణ ట్యాబ్లెట్ పీసీ. చూడ్డానికి చిన్నగా ఉన్నా పర్సనల్ కంప్యూటర్‌లో ఉన్న ఫీచర్లన్నీ ఇందులో ఉంటాయి. స్మార్ట్‌ఫోన్లతో పోలిస్తే పెద్ద స్క్రీన్, స్పష్టత వీటికి అదనపు ఆకర్షణ. యాపిల్, శామ్‌సంగ్ వంటి బహుళజాతి సంస్థలకు పోటీగా దేశీయ కంపెనీలు సైతం ట్యాబ్లెట్ పీసీలను మార్కెట్లోకి తెస్తున్నాయి. దీంతో వీటి ధర రూ.10 వేల లోపే పలుకుతోంది. ట్యాబ్లెట్ పీసీల్లో 3జీ మొబైల్ సర్వీసు కలిసి ఉండడంతో వినియోగదారులు వీటి పట్ల విపరీతంగా ఆకర్షితమవుతున్నారు. ముఖ్యంగా యువత, వ్యాపార రంగంలోనివారు వీటిపై మోజు పడుతున్నారు.

ట్యాబ్లెట్ పీసీలపై పెరుగుతున్న మోజు

అంతగా ఆకట్టుకుంటోందంటే ప్రత్యేకతలేవో వుండాలిగా. అవేంటో చూద్దాం. ఏడు అంగుళాల స్క్రీన్‌సైజు నుంచి లభించే ట్యాబ్లెట్ పీసీల్లో చాలామటుకు ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పనిచేస్తాయి. దీని నుంచి ఈ-మెయిల్స్‌ను పంపుకోవచ్చు. సోషల్ అప్లికేషన్లను వినియోగించవచ్చు. బ్లూటూత్, వైఫై, వీడియో రికార్డింగ్, వీడియో, వాయిస్ కాల్స్ దీని సొంతం. మోడల్‌ను బట్టి ఇంటర్నల్ మెమరీ 16 జీబీ నుంచి 64 జీబీ వరకు ఉంది. కొన్ని ట్యాబ్లెట్లయితే హై డెఫినిషన్ వీడియోను ఆఫర్ చేస్తున్నాయి. గీతలు పడకుండా స్క్రీన్‌పై గొరిల్లా గ్లాస్ ఉంటుంది. తాజాగా హనీకాం 3.0 వర్షన్ ఆపరేటింగ్ సిస్టమ్ వచ్చింది.

ప్రస్తుతం భారత్‌లో ఆపిల్, శామ్‌సంగ్, హెచ్‌టీసీ, బ్లాక్‌బెర్రీ, డెల్, మోటారోలా, ఏసర్, బీటెల్, ఎంఎస్‌ఐ తదితర కంపెనీల ట్యాబ్లెట్ పీసీలు అందుబాటులో ఉన్నాయి. ఆపిల్ ఐప్యాడ్ రూ.36,900 నుంచి, శ్యాంసంగ్ గెలాక్సీ రూ.26 వేలు, బ్లాక్‌బెర్రీ ప్లే బుక్ రూ.24 వేల నుంచి లభిస్తున్నాయి. చైనాకు చెందిన జడ్‌టీఈ కార్పొరేషన్ సహకారంతో రిలయన్స్ కమ్యూనికేషన్స్ రూ.13 వేల ధర గల ట్యాబ్లెట్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ట్యాబ్లెట్‌ను వినియోగిస్తున్న వారిలో అత్యధికులు వ్యాపారస్తులే. సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి బోర్డు రూం మీటింగుల్లో ఇవి తప్పకుండా ఉంటున్నాయని సెల్‌కాన్ మొబైల్స్ సంస్థ తెలుపుతోంది. త్వరలో మన పార్లమెంటు సభ్యుల చేతుల్లో కూడా వీటిని చూడబోతున్నాం.

భారత్‌లో సుమారు 10 కోట్లకుపైగా ఇంటర్నెట్‌ను వినియోగదారులున్నారు. టెలికాంలో అపార అవకాశాలతో కంపెనీలు ఇక్కడి మార్కెట్‌పై దృష్టి పెట్టాయి. ఇదే అదనుగా సోనీ ఎరిక్సన్ రెండు ట్యాబ్లెట్లను విడుదల చేస్తోంది. వీడియోకాన్ ట్యాబ్లెట్ రావడానికి మరో మూడు నెలలు పట్టొచ్చు. ఆసస్ తన ఈ ప్యాడ్ స్లైడ్‌ను అక్టోబర్‌లో ఆవిష్కరించనుంది.

ఇటీవలే బెంగళూరుకు చెందిన లక్ష్మీ యాక్సెస్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్ 'మాగ్నం పెప్పర్' పేరుతో మధ్య తరగతి వారికోసం రూ.4,500లకే ట్యాబ్లెట్‌ను రూపొందించి సంచలనం సృష్టించింది. మైక్రోమ్యాక్స్, కార్బన్, సెల్‌కాన్, మ్యాక్స్, స్లై, జెన్ వంటి దేశీయ మొబైల్ ఫోన్ కంపెనీలు త్వరలో ట్యాబ్లెట్లను మార్కెట్లోకి తేనున్నాయి. ఇప్పటికే బీటెల్ రూ.10 వేలకే ట్యాబ్లెట్‌ను ఇస్తోంది. మిగిలిన కంపెనీల ధరలూ ఇదే విధంగా ఉండనున్నాయి. ట్యాబ్లెట్ల అమ్మకాలు భారత్‌లో 75% వార్షిక వృద్ధి రేటు నమోదు చేస్తున్నాయని పరిశ్రమ వర్గాల సమాచారం. ఇంటర్నేషనల్ డాటా కార్పొరేషన్ అంచనా ప్రకారం భారత్‌లో ఏటా 2 నుంచి 3 లక్షల ట్యాబ్లెట్ పీసీలు అమ్ముడవుతున్నాయి. 2011లో 5 లక్షల యూనిట్లు అమ్ముడవుతాయని శామ్‌సంగ్ అంచనా. ఇంతటి విస్తృత మార్కెట్‌ను చేజిక్కించుకునేందుకు ఆయా సంస్థలు సరికొత్త ఫీచర్లతో కొత్తకొత్త ఉత్పత్తులను వినియోగదార్లపైకి వదులుతున్నాయి. ఈ నేపథ్యంలో తమకు అనువైన పరికరాన్ని ఎంచుకోవడం వినియోగదారులకు కత్తిమీద సాములా మారింది. అద్భుతమైన ఫీచర్లున్నాయని ఏదైనా ఒక పరికరాన్ని తీసుకుంటే, మళ్ళీ నెల తిరగకముందే మరో సంస్థ అంతకంటే తక్కువ రేటుతో అదనపు ఫీచర్లతో రంగంలోకి వస్తోంది.



- కె.ఎక్స్.రాజు

వెజిటబుల్ హల్వా

కావలసిన పదార్థాలు

గుమ్మడికాయ తురుము - 1 కప్పు
సొరకాయ తురుము - 3 కప్పులు
పంచదార - అరకిలో, మీగడ - 2 కప్పులు
చిక్కటి పాలు - పావులీటరు, వెనిల్లా ఎసెన్స్ - 4 చుక్కలు
నెయ్యి - 1 కప్పు, జీడిపప్పు - 5
బాదంపప్పు - 5, పిస్తాపప్పు - 5, కిస్‌మిస్ - 10

తయారు చేసే విధానం

గుమ్మడి కాయ తురుములో నీరంతా పిండాలి. సొరకాయ తురుము నేతిలో దోరగా వేయించాలి. అందులోనే పాలు పోసి ఉడికించాలి. పాలు మొత్తం ఇంకిపోయాక నీరు తీసేసిన గుమ్మడి తురుము, మీగడ, పంచదార వేసి దగ్గరగా అయ్యేవరకు ఉడికించాలి. ఇలా నెయ్యి పైకి తేలేవరకు తిప్పుతూనే ఉండాలి. తర్వాత వెనిల్లా ఎసెన్స్, ఇష్టమైన వాళ్ల మిఠాయి రంగు కూడా వేసుకుని కలియదిప్పాలి. దీన్ని ఒక ప్లేట్‌లో సమానంగా పొయ్యాలి. దీనిపైన వేయించిన బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ చల్లి ముక్కలు కోసుకోవాలి. ఈ హల్వా చాలా రుచిగా వుంటుంది.



క్యారెట్-బీట్‌రూట్-మామిడి హల్వా

కావలసిన పదార్థాలు

క్యారెట్ తురుము- 1 కప్పు
బీట్‌రూట్ తురుము - 1 కప్పు
మామిడి గుజ్జు - అరకప్పు
నెయ్యి - అరకప్పు
మీగడ - 2 కప్పులు
పాలు - అరలీటర్
జీడిపప్పు - 10
యాలకులు - 5
కిస్‌మిస్ - 15, బాదంపప్పు - 10

తయారు చేసే విధానం

క్యారెట్, బీట్‌రూట్, మామిడి తురుము కలిపి రెండు స్పూన్ల నేతిలో నీరంతా ఇంకి పోయేలా వేయించాలి. బాదం పప్పును కొద్దిసేపు నీళ్లలో నానబెట్టి పొట్టు తీయాలి. వేయించిన తురుములో పాలు పోసి ఉడికించాలి. పాలు ఇంకిపోయాక అందులో పంచదార, మీగడ, మిగిలిన నెయ్యి వేసి వేయించాలి. ఇలా నెయ్యి పైకి తేలేంతవరకు వేయించుకోవాలి. చివరిలో యాలకులపొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, పొట్టు తీసిన బాదం పప్పు పొడవుగా కత్తిరించి కలుపుకుంటే చాలు. రుచికరమైన హల్వా రెడీ.

క్యాలీఫ్లవర్ చికెన్

కావలసిన పదార్థాలు

చికెన్ - అరకిలో
క్యాలీఫ్లవర్ - అరకిలో
టమాటాలు - 3
పెరుగు - 1 కప్పు
ఉప్పు - తగినంత
కారం - 2 టీ స్పూన్లు
నూనె - అరకప్పు,
ఉల్లిపాయలు - 2
పచ్చిమిర్చి - 4, ధనియాల పొడి - 2 టీ స్పూన్లు
అల్లం పేస్ట్ - 1 టేబుల్ స్పూన్

తయారు చేసే విధానం

చికెన్ చిన్న ముక్కలు కోసుకోవాలి. క్యాలీఫ్లవర్‌ను చిన్న పువ్వులుగా తెంపుకుని వేడినీటిలో ముంచి తియ్యాలి. బాండీలో నూనె కాగాక సన్నగా తరిగిన ఉల్లి, పచ్చిమిర్చి వేసి దోరగా వేయించాలి. అందులోనే అల్లం పేస్టును పచ్చివాసన పోయేలా వేయించాలి. చికెన్ ముక్కలు, ధనియాల పొడి వేసి కలిపి 5 నిమిషాలు మగ్గబెట్టాలి. తర్వాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు, పెరుగు వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి. క్యాలీఫ్లవర్ పూలు, ఉప్పు, కారం వేసి సన్న సెగమీద నీరంతా ఇంకిపోయే వరకు ఉడికించాలి. ఇది బిర్యానీలోకి బాగుంటుంది.

ఫ్రూట్ బిస్కెట్లు

కావలసిన పదార్థాలు

మైదా - అరకిలో, గుడ్లు - 6
పంచదార - పావుకిలో, నూనె - వేయించడానికి సరిపడా
పుచ్చకాయ - 1, కమలా రసం - 1 కప్పు
బేకింగ్ పౌడర్ - 1 స్పూన్

తయారు చేసే విధానం

పుచ్చకాయ రసం తీసిపెట్టుకోవాలి. పంచదార పొడి చేసుకోవాలి. జల్లించిన మైదాపిండిలో బేకింగ్ పౌడర్, పంచదార పొడి వేసి కలపాలి. అందులో కోడిగుడ్ల సొన, పుచ్చరసం, కమలారసం వేసి ముద్దలా కలపాలి. వీటితోనే పిండి ముద్దవుతుంది. అవసరమైతే నీళ్లు పోసుకోవచ్చు. దీన్ని పెద్ద పెద్ద ఉండలు చేసుకుని చపాతీ కంటే కొద్దిగా మందంగా వత్తుకోవాలి. వీటిని ఇష్టమైన ఆకారంలో కత్తిరించుకుని కాగిన నూనెలో బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. కరకరలాడే రుచికరమైన బిస్కెట్లు రెడీ.



- ఎన్. భువనేశ్వరమ్మ

తిరుపతి.



అందాల అండమాన్

అండమాన్ దీవులు మంచి పర్యాటక స్థలాలు అని అంటుంటారు. వీటిని చూడ్డానికి మా ప్రయాణం చెన్నైనుండి ప్రారంభమైంది. అండమాన్ దీవులకే అయితే భారతీయులకు ప్రత్యేక అనుమతులు అవసరం లేదు. కానీ నికోబార్ ద్వీపాలను, ఇతర ఆదివాసీ ప్రాంతాలకు మాత్రం అనుమతి తప్పనిసరి. పైగా అది అంత సులభంగా దొరకదు.

కోల్‌కతా, చెన్నై, విశాఖ నుండి అండమాన్‌కి ఓడ ప్రయాణం కూడా వీలౌతుంది. కానీ అది సుమారు నాలుగు రోజుల ప్రయాణం. కోల్‌కతా, చెన్నై నుండి విమాన సౌకర్యం కాస్త ఖరీదైనదే. కానీ ఓడ ప్రయాణ ఖర్చుకంటే తక్కువ.

మేం ఎక్కిన విమానంలో ప్రయాణీకులు చాలా తక్కువమందే ఉన్నారు. అండమాన్‌కి ప్రతిరోజూ మాంసం, ఆహార పదార్థాలు, వార్తాపత్రికలు విమానం ద్వారా అందుతాయి. సుమారు రెండు గంటల ప్రయాణం తర్వాత వీర్‌సావర్కర్ విమానాశ్రయంలో దిగాం. అదో చిన్న అందమైన ఎయిర్‌పోర్ట్. భద్రతరీత్యా దీన్ని సాయంత్రం మూడు గంటల తర్వాత భారతీయ వాయు సేన తన అధీనంలోకి తీసుకుంటుందట. మళ్లీ మరుసటి ఉదయమే విమాన రాకపోకలు మొదలు. ఈ చిట్టి ఎయిర్‌పోర్టుని 1947లో నిర్మించారట.

మేం అండమాన్‌లో అడుగుపెట్టిన వెంటనే గ్రహించింది సగటు నగరాల్లో మాదిరిగా ట్రాఫిక్ సమస్య లేకపోవడం. పైగా అతి తక్కువ ట్రాఫిక్ సిగ్నళ్లు ఉండడం (మేం చూసింది మాత్రం ఒక్కచోటే). మా విడిది నుండి సముద్రాన్ని చూస్తే అసలు ఇది బంగాళాఖాతమేనా? అనిపించింది. తూర్పు తీరంలోని బీచులు అంత అందంగా, ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా, క్లీన్‌గా ఉండవన్నది నా అనుభవం. కానీ అండమాన్‌లో చూస్తే సముద్రం స్వచ్ఛంగా, అందమైన ఊదారంగులో కనిపించింది. ఇదే సముద్రమా మనకి అంత మురికిగా కనిపించేది అనిపించింది!

పోర్ట్ బ్లెయిర్‌లో టాక్సీలు, ఆటోలు ఉంటాయి. అద్దెకు స్కూటర్లు, మోటార్ సైకిళ్లు కూడా లభిస్తాయి. కాకపోతే ఇప్పుడు అవి బాగా తగ్గిపోయాయి.

అండమాన్, నికోబార్ ద్వీపాలలో పోర్ట్‌బ్లెయిర్ అతి పెద్ద నగరం, వాటి రాజధాని కూడా. సుమారు లక్ష జనాభా ఉండే ఈ నగరం అన్ని తీర నగరాల్లాగే కనిపించింది. భారతదేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలవారూ ఇక్కడ కనిపిస్తారు (టూరిస్టులు కాదు!). ఈ నగరాన్ని 'మినీ ఇండియా' అంటారట. మొత్తం ద్వీపాలలో చారిత్రక నేపథ్యం ఉన్నదీ పోర్ట్‌బ్లెయిర్‌కే!

అండమాన్ నికోబార్ ద్వీపాలు భారత భూభాగం లోనివే. అయినా మయన్మార్, థాయ్‌లాండ్‌కి మనకంటే దగ్గరగా ఉంటాయి. ఇవి సుమారు 600 ద్వీపాల సమూహం (కొంతమంది 360 అంటుంటారు). మన





అగుడు భాగం పారదర్శకంగా ఉన్న పడవ

భూభాగానికి సుమారు 1400 కి.మీ దూరంలో ఉండే ఈ ద్వీపాలు తిరుగుబాటుదార్లను, స్వతంత్ర సమరయోధులను 'శిక్షించడానికి' ఉపయోగపడేవి అనే పేరు సంపాదించుకున్నాయి. బ్రిటీష్‌కాలంలో ఇక్కడి సెల్యులార్ జైల్ (కాలాపానీ) బాగా 'ప్రసిద్ధి' పొందింది. కరడుగట్టిన నేరస్థుల నుండి స్వతంత్రం కోసం తిరుగుబాటు చేసిన వారి వరకు ఇందులోనే ఖైదు! వారిని అతి దారుణంగా హింసించేవారని చరిత్ర. అయితే అదంతా నిజమేనా అన్నంత అందంగా ఉంది ఇప్పుడు. ఉదయం తొమ్మిదిన్నర నుండి సాయంత్రం నాలుగు వరకు సందర్శకుల కోసం తెరిచి ఉంటుంది. సోమవారాలు సెలవు.

నీటిలోపల కోరల్స్

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపనీయులు స్థావరం ఏర్పాటు చేసుకున్న భారత ప్రదేశం అండమాన్. ఇప్పటికీ పోర్ట్‌బ్లెయిర్‌లో వారి బంకర్లు కనిపిస్తాయి. జపనీయుల రాకతో ఇక్కడి ఖైదీల పట్ల హింస మరింత పెచ్చరిల్లిందట. ఆహారం తక్కువయిందనిపిస్తే ఖైదీలను, ప్రజలను ఇతర ద్వీపాలకు తరిమి వేసేవారట. మరో మానవ మాత్రుడు లేని ఆ ద్వీపాల్లో వారి చావు వారు చావాల్సిందే!

ఆ మరుసటి రోజు మూడు ద్వీపాలు చూడ్డానికి ప్రయాణమయ్యాం. నిజానికి ఇన్ని వందల ద్వీపాలున్నా వాటిలో పదింటిలో మాత్రమే మానవులు నివసిస్తున్నారంటారు. ముందుగా మేం రాస్ ద్వీపానికి వెళ్లాం. ఇది 1942లో రాజధానిగా ఉండేది. ఒకానొక భూకంపంలో పోయింది పోగా మిగిలింది ఈ చిన్న భాగమే. అప్పటి కమీషనర్ ఆఫీసూ, శిధిలావస్థలో ఒక చర్చ్ ఉన్నాయి. ఈ ద్వీపానికి వెళ్లడానికి పడవలే సాధనం. ఈ ద్వీపాలపై అడుగు పెట్టడానికీ ప్రవేశరుసుము ఉంది. కెమెరాలకి అదనపు రుసుము. రాస్ ద్వీపంలో 'స్మృతిక' అనే ఓ చిన్న మ్యూజియం ఉంది. అందులో పురాతన బ్రిటీష్ కాలం నాటి ఫొటోలున్నాయి.

అక్కడి నుండి వైపర్ ద్వీపానికి వెళ్లాం. ఇక్కడా ఓ జైలుంది. సెల్యులార్ జైలు నిర్మించక ముందు దీనిని వాడేవారు. అంతకుమించి ఆ ద్వీపంలో చెప్పుకోదగ్గ విశేషాలు ఏమీ కనిపించలేదు. కాకపోతే 2004 వాటి సునామీ గుర్తులు ఇంకా వున్నాయి.

మధ్యాహ్నం నార్త్ బేకి ప్రయాణమయ్యాం. ఇది కోరల్స్‌కి ప్రసిద్ధి. నీటిలో దిగి, కోరల్స్‌ని చూడడం బావుంది. కానీ విపరీతమైన రద్దీ. అక్కడో ప్రత్యేకమైన బోట్ ఉంది. దాని కింది భాగం పారదర్శకంగా, గాజువంటి పదార్థంతో చేయబడింది. దానిద్వారా నీటిలోపలి కోరల్స్ చూడొచ్చు. అండమాన్‌లో సాయంత్రం 5 కల్లా సూర్యాస్తమయం అయిపోతుంది. నార్త్‌బేలో ఒక ప్రాథమిక పాఠశాల కూడా ఉంది. సుమారు 20 కుటుంబాలు మాత్రమే ఇక్కడ నివసిస్తాయట.

హేవ్‌లాక్ ద్వీపం, నీల్ ద్వీపం కూడా కోరల్స్‌కి ప్రసిద్ధి. ఇంకా ఇక్కడ అటవీ ప్రదర్శనశాల (అనేక రకాల కలప కళాఖండాలకు నెలవు), ఫిషరీస్ మ్యూజియం, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియం ఉన్నాయి. అండమాన్ వాటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జలక్రీడల సంరంభం ఉంటుంది. దానికి దగ్గర్లోనే ఒక మరీనా పార్క్ ఉంది. మొక్కలంటే ఆసక్తి ఉన్నవారికి ఇది మంచి దర్శనీయ స్థలం.

ప్రకృతిని చూసి ఆనందించాలనుకునే వారికి నీల్ ద్వీపం స్వర్గధామం. అండమాన్‌లో చూడదగ్గ ముఖ్యమైన ప్రదేశం. పోర్ట్ బ్లెయిర్‌కి దాదాపు 36 కి.మీ దూరంలో ఉంటుంది.

మొత్తానికి మరీ అద్భుతం కాకపోయినా ఓ మోస్తరు ఆకర్షణీయమైన దీవుల సముదాయం అండమాన్. చాలా టూరిస్టు స్థలాల్లోలాగే ఇక్కడా సరైన భోజనం దొరకదు. పైగా అన్నీ బయటినుండి రావడం వల్ల ఖరీదూ ఎక్కువే. మనదేశ భూభాగమే అయినా ఏదో విదేశం వెళ్లొచ్చిన అనుభూతి కలుగుతుంది. అందుకోసం సరదాగా అండమాన్ వెళ్లి రావచ్చు. మూడు నాలుగు రోజులుండే విధంగా ప్లాన్ చేసుకుంటే బోర్ కొట్టదు. సముద్రమూ, బీచులూ సరిపడని వారికి అండమాన్ యాత్ర కూడా సరిపడదు.

- యాజీవ్



నిరాహార దీక్ష!
ఉద్యమాల భాషలో తరచుగా వినిపించే మాట.
ఇటీవల దాదాపు ప్రతి ఇంటా వినిపిస్తున్న మాట. ఈ దీక్షా పద్ధతి ఇప్పుడు పుట్టింది కాదు. చాలా చరిత్రే వుంది. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ, భగత్‌సింగ్, జతీంద్ర నాథ్, భటుకేశ్వర్ దత్ మొదలుకొని అమరజీవి పొట్టి శ్రీరాములు నుంచి నేడు అన్నా హజారే వరకు ఎందరో ఎన్నో సందర్భాల్లో ఈ అస్త్రాన్ని ప్రయోగించారు. ఆ వివరాలు ఈ వారం అట్టమీది కథలో...



నిరాహార సమరం

అనుకున్నది సాధించడం కోసం, లేనిదాన్ని పొందడం కోసం, న్యాయం కోసం, హక్కుల కోసం ఎన్నో పోరాట మార్గాలున్నాయి. అయితే ఒక వ్యక్తి లేదా కొంత మంది ఆహారం తీసుకోకుండా ప్రభుత్వాల మీద ఒత్తిడి పెంచేదే నిరాహార దీక్ష. చాలా సాధారణంగా కనిపించే పోరాట రూపం. ఇళ్లలోనూ ఈ దీక్ష జరుగుతూనే వుంటుంది. తల్లిదండ్రులు తమ కోర్కెలు తీర్చలేదని పిల్లలు అలిగి ఆహారం మానివేసి సాధించుకోవడం చూస్తూనే వుంటాం. అప్పుడప్పుడు భర్తలు కూడా అన్నంపై అలుగుతుంటారు. గాంధీజీ ఈ పద్ధతిని రాజకీయ లక్ష్య సాధనకు జోడించాడు. అహింస ప్రధానమనే ఆయన భావనకు ఇది బాగా సరిపోయింది. అప్పటి నుంచి దేశంలో అలాగే స్థిరపడిపోయి స్వాతంత్ర్యానంతరమూ కొనసాగుతున్నది. కాకపోతే చేపట్టిన సమస్యతో పాటు చేసే వ్యక్తిని బట్టి మద్దతు లభిస్తుంటుంది. ప్రాధాన్యత సంతరించుకుంటుంది. మహాత్ముడి నిరాహార దీక్షలకు చాలాసార్లు బ్రిటిష్ ప్రభుత్వమే దిగిరాక తప్పిందికాదు. పొట్టి శ్రీరాములు దీక్షతో తెలుగు రాష్ట్రమే ఏర్పడింది. సమరశీల పోరాటాలకు ఎంతటి ప్రాధాన్యత లభించిందో సాత్విక పోరాటమైన నిరాహార దీక్షకూ అంతటి ప్రసిద్ధి లభించడాన్ని బట్టి ఆ అస్త్రానికున్న శక్తి తెలుస్తోంది. ఒక దశలో కొంత అపహాస్యానికి గురైన ఈ దీక్షలకు తిరిగి గౌరవం తెచ్చిపెట్టింది వారేనని చెప్పాలి.

'అశనము' అంటే అన్నం. భోజనం. 'నిరశనము' అంటే ఆహారం తినకుండా వుండడం. ('నిరసన' అంటే నిరాకరించడం, వ్యతిరేకించడం, ఈ రెండు పదాలూ తారుమారవుతుంటాయి) పూర్వం దీన్నే సత్యాగ్రహమనీ అనేవారు. సమస్య పరిష్కారమయ్యేవరకూ చేసేది నిరవధిక నిరాహారదీక్ష. దీన్నే ఆమరణ అంటారు గాని సాంకేతికంగా సరికాదు. ఎందుకంటే కోరిక పరిష్కారమే కొలబద్ద తప్ప మరణం కాదు. అలాగే ఒక కోర్కెపై వరుసగా ఒకరి తర్వాత ఒకరు దీక్షలు కొనసాగిస్తే దాన్ని రిలే నిరాహారదీక్ష అంటుంటారు. ఒకరోజు మాత్రమే చేస్తే అది నిరసన దీక్ష. ఇటీవల 48 గంటలు, 72 గంటలు ఇలా ప్రకటించి దీక్షలు చేయడం కొత్త పద్ధతిగా వచ్చింది. సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లడానికీ, సమస్య మద్దతు సమీకరించడానికీ ఇవి ఉపయోగపడ్డాయి.

నిరాహార దీక్ష ప్రస్తావన పురాణాల్లోనూ వుంది. మరింత కచ్చితంగా చెప్పుకోవాలంటే రామాయణంలో భరతుడి నోట వినిపిస్తుంది. ప్రచారంలో వున్న కథ ప్రకారం రాముడు అరణ్యవాసానికి వెళ్లినప్పుడు తిరిగి వచ్చి రాజ్యపాలన చేపట్టమని భరతుడు రాముణ్ణి కోరతాడు. అందుకు రాముడు అంగీకరించడు. తన మాటను మన్నించనందుకు నిరాహారదీక్షకు ఉపక్రమించాలని భావిస్తాడు భరతుడు. కాకపోతే రాముడు నచ్చచెప్పడంతో ఆయన ఆ ప్రయత్నం నుంచి విరమించుకున్నాడట.

బాకీ వసూలు చేసే ఆయుధం

ఐర్లాండ్ వంటి దేశాల్లో క్రీస్తుకు ముందు నుంచే నిరాహారదీక్ష వున్నట్లు చరిత్ర వల్ల తెలుస్తోంది. మొదట మొండిబాకీల వసూళ్లకు, న్యాయం కోసం వత్తిడి తెచ్చేందుకు ఈ అస్త్రాన్ని ఉపయోగించేవారట. ఆరోజుల్లో ఎవరైనా ఇలా తమ ఇళ్లముందు నిరాహారదీక్షకు దిగడాన్ని చాలా చిన్నతనంగా, అగౌరవంగా భావించేవారట. మన దేశంలో ఇలా బకాయిపడిన వారి ఇళ్ల ముందు నిరాహార దీక్షకు దిగి, బాకీ వసూలు చేసుకోవడాన్ని బ్రిటీష్ ప్రభుత్వం 1861లో నిషేధించింది.

బాపూజీ స్ఫూర్తితో...

సత్యాగ్రహాన్నే సాధనంగా మలచుకొని అనుకున్నది సాధించిన ప్రముఖుడు గాంధీజీ. దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ అనేకసార్లు నిరాహారదీక్షకు కూర్చుని అనుకున్నది సాధించాడు. గాంధీ స్ఫూర్తితో ఎంతోమంది విదేశీయులు కూడా ఈ అస్త్రాన్ని చేపట్టారు. దక్షిణాఫ్రికాలో నల్లజాతి వెలుగురేఖ నెల్సన్ మండేలా, అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ వంటివారు ఈ ఆయుధంతో పోరునూ సాగించారు. వాషింగ్టన్ డి.సిలో ప్రభుత్వానికి చెందిన ఓ భారీ భవంతిని 1,400 పడకల సిటీ షెల్టర్‌గా మార్చాలని కోరుతూ మిచ్ స్నైడర్ అనే న్యాయవాది 1984లో 51 రోజుల పాటు నిరాహారదీక్ష చేపట్టాడు. అమెరికా సర్కారు దిగిరావడంతో ఆయన కోరిక నెరవేరింది.

మొక్కవోని దీక్ష

ఈ మధ్య ఒక్కరోజు దీక్ష చేపడుతున్న వారిని కూడా చూస్తున్నాం. కానీ ఏకంగా దశాబ్దకాలంగా నిరాహార దీక్ష చేస్తున్నవారూ వున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. అలాంటి ఉక్కుమహిళే మణిపూర్‌కు చెందిన చాను షర్మిళ. సరిగ్గా 2000 సంవత్సరంలో ఆమె దీక్షను చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు తన చేత్తో తను ఒక్క మెతుకు అన్నం ముట్టలేదంటే ఒట్టు. కానీ ప్రభుత్వం మాత్రం బలవంతంగా ద్రవాహారాన్ని ట్యూబుల ద్వారా ఎక్కిస్తూనే వుంది. ఇంతకీ పదేళ్ల నిరాహార దీక్ష వెనక ఏముందో తెలుసుకోవాలంటే పదేళ్ల వెనక్కి వెళ్లాలి. మణిపూర్లో సాయుధ దళాలు జరిపిన కాల్పుల్లో పది మంది అమాయకులు చనిపోయారు. ఇది షర్మిలను కలచివేసింది. వారికి అటువంటి విశేష అధికారాలు కల్పించిన సాయుధ దళాల ప్రత్యేక అధికారుల చట్టం, 1958ని రద్దు చేయాలని కోరుతూ ఆమె 2000, నవంబర్ 2న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు.

ఆమరణ దీక్షలోనే అమరుడై!

చేపట్టిన దీక్ష ఒక్కటే అయినా ఎవరి డిమాండ్లు వారివి. కొన్ని ప్రత్యేకంగానూ వుంటాయి. అటువంటివాటిలో ఒకటి స్వామి నిగమానంద దీక్ష. పర్యావరణ పరిరక్షణ కోసం నిరాహార దీక్ష ప్రారంభించారాయన. భారతీయులు పవిత్రంగా భావించే గంగానదిని కలుషితం చేస్తున్న ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని, కుంభమేళా జరిగే ప్రాంతంలో నెలకొల్పిన కంకర మిల్లులను తరలించాలన్నవి ఆయన డిమాండ్లు. ఉత్తరాంచల్‌లోని హరిద్వార్‌లో ఫిబ్రవరి 19న ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. మే2వ తేదీన ఆయన ఆరోగ్యం క్షీణించి అపస్మారక స్థితికి చేరుకున్నారు. మొదట ఆయనను హరిద్వార్ జిల్లా ఆస్పత్రిలో చేర్చారు. ఆ తర్వాత ఆయనను హెచ్ఐహెచ్‌టి ఆస్పత్రికి తరలించారు. చివరకు జూన్ 13వ తేదీన అంతిమ శ్వాస విడిచారు. గంగానదిని హిందువులు పరమ పవిత్రంగా భావిస్తారు. అయితే ఆ హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని, వారి హక్కుల రక్షణకు అంకితం అయ్యామని చెప్పుకునే ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులెవ్వరూ దీక్షలో వుండగా స్వామి నిగమానందను పలకరించలేదు. ఏ రాళ్ల కొట్టే క్రషర్‌ను కుంభమేళా ప్రాంతం నుంచి తొలగించాలని నిగమానంద పోరాడాడో అది సంఘ్ నాయకుల్లో ఒకరిదని అంటారు. దాంతో నిగమానంద చేసిన పోరాటానికి మద్దతు ఇవ్వడానికి వారెవరూ ముందుకు రాలేదు. చివరకు హరిద్వార్ జిల్లా ఆస్పత్రిలో వున్న నిగమానంద మీద విష ప్రయోగం జరిగిందని కూడా మాతృసదన్ ఆశ్రమం వారు ఆరోపిస్తున్నారు.

బలవంతపు ఆహారం

జైల్లో వున్న రాజకీయ ఖైదీలు నిరాహారదీక్షకు కూర్చున్న ఘటనలు అనేకం. స్వతంత్ర పోరాట కాలంలో సమరశీలయోధులకూ పరాయి పాలకులకూ మధ్య ఇదో పెద్ద పోరాటం. నీరసపడిపోయినవారికి బలవంతంగానైనా





మరికొన్ని

- టీఆర్ఎస్ నేత కె.చంద్రశేఖరరావు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ నేపథ్యంలో 14 ఎఫ్ రద్దు కోరుతూ 2009లో నిరాహారదీక్ష చేపట్టారు. ఇది అనేక రాజకీయ పరిణామాలకు దారి తీసింది. తర్వాత కూడా ఇదే సమస్యపై వివిధ పార్టీల నాయకులు విద్యార్థులు, ఉద్యోగనేతలు తదితరులు వివిధ దశల్లో నిరాహారదీక్షలు చేశారు. ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటివి కొంతవరకు జరిగాయి.
- రైతన్నల సమస్యలపై తెదేపా అధినేత చంద్రబాబు 2010లో దీక్ష చేశారు. భారీ వర్షాన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలని, దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, పావలా వడ్డీ రుణాలు ఇప్పించాలని, పంట బీమా అందరికీ వర్తింపచేయాలన్న పలు డిమాండ్లతో ఆయన ఈ దీక్ష చేశారు.
- కడప ఎంపీ జగన్మోహన్ రెడ్డి ఒక్క రోజు దీక్షలు చేపట్టారు.
- విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని భారత్‌కు తీసుకురావాలంటూ బాబా రామ్‌దేవ్ ఈ ఏడాది జూన్ మాసంలో దీక్షకు కూర్చున్నారు. కాకపోతే 24 గంటలు గడవక ముందే ప్రభుత్వం ఆయన దీక్షను భగ్నం చేసింది.
- మమతాబెనర్జీ సింగూర్‌లో రైతులు భూములకు సంబంధించి దీక్ష చేశారు.
- నాటకీయతకు పేరొందిన తమిళనాడులో ముఖ్యమంత్రులు కరుణానిధి, జయలలిత అమిత ప్రచారంతో ఒక్కరోజు దీక్షలు చేస్తుంటారు.అంతకు ముందు కేరళ వామపక్ష నేతలు పలుసార్లు తమ కోర్కెలపై రాష్ట్రంలోనూ ఢిల్లీలోనూ నిరాహారదీక్షలు చేశారు.
- విజయవాడ శాసనసభ్యుడు వంగవీటి రంగా నిరాహారదీక్షలో వుండగా హత్యకు గురవడం అనేక దుష్పరిణామాలకు దారి తీసింది. తర్వాత ఆయన భార్య కూడా దీక్ష బూనడంతో ఉద్రిక్తత కొనసాగింది.
- 1991లో రాజీవ్ గాంధీ హత్యానంతరం జరిగిన దాడులకు నిరసనగా తెలుగు దేశం అధినేత ఎన్టీఆర్ టాంక్‌బండ్‌పై నిరాహారదీక్ష చేశారు. చిన్న నూలు టవలు కట్టుకుని, నీటికోసం తాబేటి బుర్ర పట్టుకుని, ఎవరితోనూ మాట్లాడకుండా తనదైన శైలిలో చాలా రోజులు దీక్ష చేశారు. ఆయనను పరామర్శించడానికి జాతీయ నాయకులందరూ తరలి వచ్చారు.

ఎన్ని రోజులు?

శరీరం అనే యంత్రం నడవాలంటే కనీసం గ్లూకోజ్ అనే ఇంధనం కావాలి. నిరాహార దీక్ష మూలంగా శరీరంలోకి కొత్తగా గ్లూకోజ్ చేరదు. దీక్ష చేపట్టిన 4 నుంచి 8 గంటల తర్వాత శరీరంలో గ్లైకోజెన్ రూపంలో నిల్వ వుండే గ్లూకోజ్‌ను ఉపయోగించే బాధ్యతను కాలేయం తీసుకుంటుంది. ఆ నిల్వ కూడా అయిపోగానే శరీరంలోని కొవ్వును వాడుకుంటూ శక్తిని సమకూరుస్తుంది. ఇతరత్రా ఆరోగ్య సమస్యలు లేకపోతే దీక్షకు కూర్చున్న వ్యక్తి దృఢత్వాన్ని బట్టి కొద్ది రోజుల పాటు బండిని నడిపించొచ్చు. అయితే నిరాహారదీక్షను విరమించిన తర్వాత కూడా శరీరాన్ని అదుపులోకి తెచ్చుకోవడానికి కొద్దిపాటి వైద్య సలహాలు పాటించక తప్పదు.

ఆహారం ఎక్కించే ప్రయత్నం చేస్తారు జైలు అధికారులు. ఆ ఆహారం ఎక్కించే విధానం ఎంత క్రూరంగా వుంటుందనేదాన్ని వర్ణించలేం. పుచ్చలపల్లి సుందరయ్య 1930లో తొలిసారిగా అరెస్టయ్యారు. ఆయనతోపాటుగా దళ సభ్యులందర్నీ కలిపి బోర్‌స్టల్ స్కూలుకు పంపారు. మామూలుగా అది జైలు కాదని, చిన్నవారిని సంస్కరించే పాఠశాల అని భావం. నిజానికి అది జైలుకన్నా అధ్వానంగా వుంది. అవినీతికి ఆలవాలం. ఖైదీలకు పెట్టే తిండి నిరుపేదలు కూడా తినలేని విధంగా వుండేది. అన్నింటినీ మించి అక్కడ వండే పద్ధతి చాలా అసహ్యంగా వుండేది. ఆ గిన్నెలు శుభ్రంగా కడిగేవారు కాదు. తెచ్చిన కూరగాయలు శుభ్రం చేసేవారు కాదు. ఇక బియ్యం, పప్పులు బాగు చేసే ప్రసక్తే లేదు. ఇనుప గుండిగలలో వండేవాళ్లు. అన్నంలో కూడా చిన్నచిన్న ఇనుప పెళ్లలు వుంటుండేవి. ఇవికాక ఖైదీల పట్ల కుల, ప్రాంతీయ వివక్ష వుండేది. ఆంగ్లో ఇండియన్ ఖైదీలకు మాత్రం రొట్టె, వెన్న, ఎక్కువసార్లు మాంసం అందించేవారు. దాంతో సుందరయ్యతో సహా కొందరు నిరాహారదీక్షకు కూర్చున్నారు. మూడో నాటి నుంచే దీక్షకు కూర్చున్న వారికి ఆహారం ఎక్కించనారంభించారు. అది ఎంత దారుణంగా వుండేదో సుందరయ్యగారి మాటల్లో ('విప్లవపథంలో నా పయనం' ఆధారంగా) తెలుసుకుందాం.

"నల్గురు జైలు ఉద్యోగులు వచ్చే వాళ్లు. సత్యాగ్రహిని వెనక్కి పడేసేవాళ్లు. ఒకడు కాళ్ల మీద కూర్చునేవాడు. ఒకడు తల కదలకుండా పట్టుకునేవాడు. రొమ్ముల వద్ద ఒకడుండి రెండు చేతులూ గట్టిగా పట్టుకునేవాడు. నాల్గోవాడు పట్టకారులాంటి దానితో నాలిక బయటకు లాగి గొంతులో గంజి పోసేవాడు. అయినా, గొంతు కండరాలను బిగబట్టి ఆ గంజి గొంతులో జారకుండా కొందరం ప్రతిఘటించేవారము. అలాంటి వారి గొంతులోకి ఒక సత్తు చెంచా పెట్టి, నాలిక అడుగు భాగం దాకా నెట్టి, అక్కడ దాన్ని "స్క్రూ" తిప్పినట్టు తిప్పేవారు. ఆ బాధ భరించలేనిదిగా వుండేది. నిజానికి నేనూ ఆ బాధను భరించలేకపోయేవాణ్ణి!".

వీరకిశోరాల దీక్ష

భారత విప్లవ వీర కిశోరాలైన భగత్‌సింగ్, జతీంద్రనాథ్ దాస్, మరికొందరు 1929లో జైలులోనే నిరాహార దీక్షకు కూర్చున్నారు. వీరు నిరాహార దీక్షను ఒక రాజకీయ పోరాటంగానే భావించారు. పైగా తాము ఓ రాజకీయ ముసాయిదా ద్వారా తమ నిరాహార దీక్ష ఉద్దేశాన్ని ప్రభుత్వానికి, ప్రజలకు తెలియచేయాలనుకున్నారు. జైళ్లలో అధికారులు రాజకీయ ఖైదీలపట్ల అమానుషంగాను, అవమానకరంగాను ప్రవర్తిస్తుండడంతో వారు దీక్షకు దిగారు. ఇది దాదాపు మూడు నెలల పైగా సాగింది. వారి డిమాండ్లు ..."రాజకీయ ఖైదీలకు మంచి భోజనం ఇవ్వాలి. అది యూరోపియన్ ఖైదీలకిచ్చే స్థాయిలో వుండాలి. పని పేరుతో జైళ్లలో హీనమైన పనులు చేయమని రాజకీయ ఖైదీలను నిర్బంధించరాదు. పుస్తకాలు, రాత సామాగ్రి ఏ ఆటంకం లేకుండా అందివ్వాలి. ప్రతి రాజకీయ ఖైదీకి ప్రభుత్వ ఖర్చుతోనే ఒక దినపత్రిక ఇప్పించాలి. రాజకీయ ఖైదీలకై ప్రత్యేకమైన ఒక శ్రేణిని ఏర్పరచాలి. ప్రతి చెరసాలలోను రాజకీయ ఖైదీల కోసం ఒక ప్రత్యేకమైన వార్డు ఏర్పరచాలి. అందులో యూరోపియన్ ఖైదీలకున్న సౌకర్యాలన్నిటినీ కలుగచేయాలి. ఒక జైలులో వున్న రాజకీయ ఖైదీలనందరినీ ఆ వార్డులోనే వుంచాలి. స్నాన వసతితో పాటు ధరించడానికి మంచి బట్టలు ఇవ్వాలి. ఉత్తర ప్రదేశ్ జైలు సంస్కరణ సంఘ సభ్యులు చేసిన సిఫారసు తమకు కూడా వర్తింపచేయాలి".

వీరిని దీక్ష నుంచి విరమింపచేయడానికి గాను అధికారులు అనేక విధాల ప్రయత్నించేవారు. వీరిని ప్రలోభ పెట్టడానికి సువాసనలు విరజిమ్మే రుచికరమైన భోజన పదార్థాలను కొట్లలో పెట్టేవారు. వారటు వెళ్లగానే వీరిలో అనేకులు ఆ భోజన పదార్థాలను, పళ్లను, పాలను వెంటనే బయటపారేసేవారు. లేకపోతే మట్టిలో కలిపేసేవారు. ఒక్క దాస్ మాత్రమే గట్టి ఆత్మ విశ్వాసంతో వుండేవాడు. ఆయన ఎప్పుడూ భోజన వస్తువులను పారవేయనూలేదు. మురికి చేయనూలేదు. ఆయన సెల్ నుంచి జైలు అధికారులు రోజూ రొట్టెలనూ, పళ్లనూ లెక్కబెట్టి తిప్పి తీసుకెళ్లేవారు. కొద్దిరోజుల తర్వాత వీరిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ప్రభుత్వం వీరికి ఒక వైద్య బృందాన్ని ఏర్పాటుచేసింది. బలవంతంగా పాలు తాగించే నాటకం మొదలైంది. దాస్ దగ్గరకు కూడా వచ్చారు. ఏడెనిమిది మంది ఒక వైపు, నిరాహార దీక్షతో కృంగికృశించిన దాస్ మరోవైపు. దాస్ మాత్రం బిగబట్టి ఏమాత్రం ఆహారం లోపలికెళ్లకుండా ఆపగలిగేవాడు. అయితే ఓసారి లాహోరులోని పిచ్చాసుపత్రి ఇన్‌ఛార్జిగా చేసిన డాక్టరు వచ్చాడు దాస్‌కు ఆహారం ఎక్కించడానికి. రెండు ముక్కుల గుండా ట్యూబులు వేసి పాలు ఎక్కించ చూస్తాడు. అయితే దాస్ మొండిపట్టుతో ట్యూబులు శ్వాసకోశాల్లోకి వెళ్లిపోతాయి. విలవిలలాడిపోతున్న దాస్ కనుగుడ్లు మారిపోతాయి. డాక్టర్ అవేమీ పట్టించుకోకుండా ఒక శేరుపాలను ఆయన శ్వాసకోశాల్లోకి నింపేసి విజయగర్వంతో వెళ్లిపోతాడు. అప్పుడు కూడా చికిత్స తీసుకోవడానికి ఇష్టపడకపోవడంతో వీరమరణం పొందాడు జతీంద్రనాథ్ దాస్.

ఎదురులేని ఎ.కె.జి దీక్ష

కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఎ.కె.గోపాలన్. ఒక పోరుడుగా, ఖైదీగా రాజ్యాంగ చట్టంలో గల హక్కులన్నింటినీ అమలు జరిపించుకునేందుకు కోర్టుకెక్కడం, రిట్లు వేయడం ఆయనకు అలవాటు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు, వెలుపల రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేత. కష్టజీవుల కోర్కెలను గురించి ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంటులో గర్జించడమే కాదు. వెలుపలా అందుకు పోరాడడంలోనూ ఘనుడే. కేరళలో భూ సమస్యపై రైతుల హక్కుల కోసం నిరాహార దీక్షబూనారు. ఆ రాష్ట్రానికి కష్టంతో బియ్యం సరఫరా కోటాను కత్తిరించినందుకు ప్రధాని నెహ్రూ ఇంటిముందే ఆయన నిరాహారదీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలకు, రాజకీయ పోరాటాలకు మాత్రమే ఆయన పరిమితం కాలేదు. అన్యాయం ఎక్కడ, ఎప్పుడు జరుగుతున్నదని భావించినా అప్పటికప్పుడు దాన్ని నివారించేందుకు

అమరావతిలో నిరాహారదీక్ష చేస్తున్న ఎ.కె.గోపాలన్

రంగంమీదికి దూకడం, అది పరిష్కారం కాకపోతే నిరాహారదీక్షను ప్రారంభించడం ఆయన తత్వం. 5 రోజుల నుంచి 48 రోజుల వరకు అనేక సార్లు దీక్షలు చేశారు. అమరావతి రైతులకోసం చేసిన నిరాహార దీక్షకు ప్రత్యేకంగా అత్యధిక ఆదరణ, దేశవ్యాప్త ప్రచారం లభించాయి. ఎకెజి అక్కడ పది రోజుల పాటు వున్నారు. జూన్ 6వ తేదీన దీక్షకు కూర్చున్నారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు వచ్చి ఆయనను పరామర్శించి వెళ్లేవారు. కానీ అననుకూల వాతావరణం. ఎడతెరిపి లేని వర్షం. బలమైన చలిగాడ్పులు. నీళ్లు, బురద, మధ్యలో చిన్న గది. దుర్భరమైన కంపు. తాగడానికి నీరు లేదు. అలాంటి ఎన్నో సమస్యల మధ్య మొక్కవోని దీక్షతో నిరాహార దీక్ష. 15, 16 తేదీలలో అనేక గంటలపాటు రాజీ సంప్రదింపులు జరిగాయి. అయినా ఎలాంటి పరిష్కారమూ వెలువడలేదు. చివరికి 17 ఉదయం ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం అమరావతి రైతులకు అనుకూలమైన కొన్ని చర్యలు తీసుకోడానికి హోం మంత్రి చాకో అంగీకరించాడు. ఒక్కొక్క కుటుంబానికి మూడెకరాల భూమి మంజూరు చేయడంతో సహా అమరావతి రైతుల డిమాండ్లలో ఎక్కువ భాగాన్ని మంత్రి అంగీకరించాడు.

అమరజీవిగా మిగిలిపోయిన నేత

ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలనే ఒడ్డిన నేత పొట్టి శ్రీరాములు. ఆంధ్ర రాష్ట్రం కోసం మద్రాసు నడిబొడ్డున ఆమరణ నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఆయన చేసిన ప్రాణ త్యాగంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. తెలుగు ప్రజల మనసుల్లో ఆయన 'అమరజీవి'గా నిలిచిపోయాడు.

స్వామీ సీతారాం

పొట్టి శ్రీరాములు కన్నా ముందు స్వామీ సీతారాం ఇదే కోర్కెపై నిరాహారదీక్ష బూనారు. 35 రోజులు సాగిన ఆయన నిరాహారదీక్షను నెహ్రూ వ్యతిరేకించడంతో ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ఆగ్రహం కలిగింది. 1952 ఎన్నికల ఫలితాల్లోనూ అది ప్రతిబింబించింది.

అవినీతిపై అన్నా అస్త్రం

దేశంలో అవినీతి నిర్మూలనకై జన్‌లోక్‌పాల్ తేవాలని కోరుతూ అన్నా హజారే 12 రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. 72 ఏళ్ల అన్నా దీక్షకు పట్టణ, మధ్యతరగతి ప్రజల నుంచి మంచి మద్దతు లభించింది. అనేక రాజకీయ పార్టీలకు చెందినవారే కాక, సినీ తారలు, మోడళ్లు, సెలబ్రెటీలు, విద్యార్థులు కూడా సంఘీభావం తెలిపారు. ఎట్టకేలకు ఆయన డిమాండ్‌ను సూత్రప్రాయంగా ప్రభుత్వం ఆమోదించడంతో దీక్ష ముగిసింది. 1996 నవంబర్‌లోనూ అన్నా హజారే 12 రోజుల పాటు దీక్ష చేశారు. మహారాష్ట్ర అవినీతి మంత్రులకు వ్యతిరేకంగా ఆయన ఆ దీక్ష చేశారు. ప్రభుత్వంలో జరిగిన 253 అవినీతి కేసులను తవ్వితీసి వాటిపై విచారణ చేపట్టవలసిందిగా కోరారు. ఇద్దరు మంత్రుల రాజీనామాతో ఆయన దీక్షను విరమించారు.

కమ్యూనిస్టు నేతల దీక్ష

దళితులు, గిరిజనులు, పట్టణ పేదలు, కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ ఏడాది మార్చిలో బి.వి.రాఘవులు సారథ్యంలో సిపిఎం నేతలు నిరాహార దీక్ష చేపట్టారు. అంతకు ముందు భూ సమస్యపై బి.వి.రాఘవులు, సిపిఐ కార్యదర్శి నారాయణ దీర్ఘకాలిక నిరాహార దీక్ష చేశారు. ఇదేగాక సి.పిఎం ప్రజా సంఘాల సామాజిక తరగతుల ప్రతినిధులు, చట్టసభల్లో ప్రజా ప్రతినిధులు పలు సార్లు నిరాహారదీక్షాయుధాన్ని సంధించి సత్ఫలితాలు సాధించారు.

ధర్నా చౌక్

ప్రజాపోరాటాల ప్రభావం ఏమిటో తెలియాలంటే ఎవరైనా హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర ధర్నా చౌక్‌కు వెళ్లి చూడాలి. అక్కడ ఏడాదిలో సగం రోజులు ఏదో ఒక సంఘానికి సంబంధించిన వారు నిరవధిక లేదా రిలే నిరాహారదీక్షలు చేస్తూనే వుంటారు. ఈ శిబిరాల నిర్వహణ కూడా చాలా బాధ్యతాయుతంగా జరుగుతుంటుంది. దీక్షల ప్రారంభం ఒక ఎత్తు. ఆ రోజున వీలైనంత ఎక్కువగా తరలి వచ్చి సంఘీభావం చెప్పేలా చూసుకుంటారు. తర్వాత దీక్షలు సాగినంత కాలం ప్రతిరోజూ ప్రముఖుల రాక, సందేశాలు సంఘీభావ ప్రకటన జరుగుతుంటాయి.

ఆయుధాలైనా, మెదడైనా ఉపయోగిస్తుంటేనే పదును తేలతాయి. పోరాట ఆయుధానికి కూడా పదును రావాలంటే తరచూ వాడుతుండాలి. పోరాడితే పోయేదేం లేదన్న మార్క్స్ మహానుభావుడి మాటను మర్చిపోకూడదు. పైగా మన చుట్టూ ఇప్పుడున్న పరిస్థితుల్లో పోరాటం అనివార్యం. అందుకే అహింసాయుతమైన నిరాహారదీక్ష అస్త్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పేరుమోసిన వారేకాకుండా సామాన్యులు చేపట్టిన దీక్షలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంది.

- కె. అంజన

నిరాహారదీక్షల క్లైమాక్స్...

ఇది రకరకాలుగా వుంటుంది. ఎవరు ఎందుకు నిరవధిక నిరాహారదీక్ష చేసినా ప్రభుత్వం కోర్కెలను ఒప్పుకోవడంపై విరమణ ఆధారపడి వుంటుంది. ప్రముఖులు కూర్చుంటే కాస్తముందో వెనకో స్పందన వస్తుంది. మామూలు వారైతే అసలు స్పందన వుండకపోవచ్చు. అయితే నిరాహారదీక్షలకు సమాంతరంగా వారికి సంబంధించినవారు రాజకీయ వత్తిడి తెస్తుంటారు గనక ఏదో ఒక విధమైన రాజీ కుదురుతుంటుంది. ప్రభుత్వం మరీ మొండిగా వుంటే వారిని బలపర్చే పెద్దలేవచ్చి చొరవ తీసుకుని విరమింపచేస్తుంటారు. ఎందుకంటే ఆమరణ అని పేరు పెట్టుకున్నా ఈ దీక్షలు మరణించడానికి కాదు కదా. కొన్నిసార్లు నాయకుల స్థాయిని బట్టి ఈ దీక్షలపై చట్టసభల్లోనూ చర్చ జరుగుతుంది. వారి స్థాయికి తగిన వారే ప్రభుత్వ ప్రతినిధులు వచ్చి నిమ్మరసం ఇచ్చి విరమింపచేయడం అక్కడున్న వారికి కుదిరిన అంగీకారం గురించి చెప్పడం జరుగుతుంటుంది. ఎవరు ఎప్పుడు దీక్ష చేసినా నిమ్మరసంతో మొదలై ముగుస్తుంటుంది. ప్రభుత్వాలు అనేక సార్లు మొండి వైఖరితో అర్ధరాత్రి దాడి చేసి దీక్షలో వున్నవారిని బలవంతంగా అరెస్టు చేసి ఆస్పత్రికి తరలిస్తుంది. వారు అక్కడా దీక్ష కొనసాగిస్తారు. అలాటి సందర్భాలు చాలా చూశాము.

చిన్నకథ

దిద్దుబాటు



సూర్యం అంటే ఆ పల్లెలో సూర్యుడే. అతను ఆ పల్లెకు డాక్టర్‌గా వచ్చిన తర్వాత వాళ్ల బతుకులతో పాటు జీవన విధానలు కూడా మారాయి. సాదా సీదాగా అతను గడిపే జీవితం, అర్ధరాత్రైనా తన కర్తవ్యాన్ని నెరవేర్చడం, రాత్రి పాఠశాల పెట్టి ఊరి జనాన్ని అక్షరాస్యులుగా తీర్చి దిద్దడం ఆ పల్లెవాసులను ఆకర్షించాయి.

అతని సలహా, సూచనల మేరకు ఎప్పటికప్పుడు ఇళ్లు, పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు చాలా వరకు తగ్గాయి.

"బాబుగారూ! మీరొచ్చిన తర్వాత మా బతుకుల్లో చాలా మార్పులొచ్చాయి. కానీ ఈ మధ్య రేషన్ దుకాణంలో బియ్యం, పంచదార, పామాయిల్, కిరసనాయిల్ సక్రమంగా పంచడం లేదు. రెణ్ణెల్లు ఇస్తే నాలుగు నెలలు బ్లాకున అమ్ముకుంటున్నారు. ఏ ప్రభుత్వం వస్తే వాళ్ల తరపువాళ్లకే కోటా ఇస్తున్నారు. మొత్తమ్మీద కోటాలు ఆ పెద్దోళ్ల మధ్యే ఉంటున్నాయి. పేదోళ్ల దగ్గరికి రావడం లేదు. ఇచ్చే కొద్ది సరుకన్నా నెలనెలా పంచితే మాలాంటోళ్లం ఇంత గంజి కాచుకుంటం" ఓ రోజున నలుగురైదుగురు ముసలోళ్లు వచ్చి సూర్యం చెవిన వేశారు.

"ముందు మీరంతా ఐక్యం కావాలి. పల్లెలో ప్రత్యేకంగా కోటా కావాలని దరఖాస్తు పెట్టుకోవాలి. తర్వాత మండలాఫీసు దగ్గరికెళ్లి ధర్నా చెయ్యాలి. పట్టిన పట్టు విడువకూడదు. పని సాధించేదాక నిద్రపోకూడదు. ముఖ్యంగా యువకులంతా నడుం కట్టాలి. అందరూ కలిసి పోరాడితే తప్పకుండా మీకు కోటా వస్తుంది. నేను ప్రభుత్వ ఉద్యోగిని కాబట్టి ప్రత్యక్షంగా ఇటువంటి వాటిలో పాల్గొనకూడదు. మీ వెనుక నా సలహాలుంటాయి" అన్నాడు సూర్యం.

అతని సలహా వాళ్లని ఆలోచింపజేసింది. కొంతమంది కలిసి ప్రత్యేక కోటా కోసం మర్నాడు మండల కార్యాలయం ముందు హాజరయ్యారు.

"మీ ఊళ్లో ఇప్పటికే మూడు కోటాలున్నాయి. మరో కోటా ఇవ్వడానికి వీలు పడదు" సివిల్ సప్లయి అధికారి చెప్పాడు.

"జనాభా లెక్కల ప్రకారం ఆ మూడు కోటాలకు సరుకు తగ్గించండి. మాకు కోటా ఇచ్చి, అక్కడ తగ్గించిన సరుకు ఇక్కడివ్వండి. కోటా అదనంగా కోరుతున్నాం కానీ, సరుకు కాదు. జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించండి" అన్నాడు సూర్యం.

"అంతే అట్టా జరగాల్సిందే. అంతదాక ఇక్కడ్నుంచి కదలం" మొండిగా అన్నాడు యూసఫ్.

"మూకుమ్మడిగా ఇలా ఆఫీసు మీదికి దండెత్తుకొస్తే అరెస్టు చేయిస్తాం" బెదిరించాడు అధికారి.

"మమ్మల్ని అరెస్టు చేసినా, ఇంకేం చేసినా ఇక్కడ్నుంచి కదలం. కోటా కాగితాలు మాచేతికొచ్చేదాక నిరాహారదీక్ష చేస్తాం" పట్టుపట్టాడు లాజరు.

అలా నిరాహారదీక్ష రెండు రోజులు కొనసాగింది. ఒకరిద్దరు ఆకలికి ఇబ్బంది పడ్డా మిగిలిన వాళ్లు ఊరుకోలేదు.

"రెండ్రోజులు అన్నం తినకుంటే మనమేం చచ్చిపోం. కోటా సంపాదించుకుంటే జీవితాంతం మన అవసరాలు తీర్చుకునే అవకాశం ఉంది. ఓపిక పట్టండి" ధర్నాను ఉద్దేశించి రామ్మూర్తి అన్నమాటలు వారికి బలం చేకూర్చాయి.

ఇంకా ధర్నా కొనసాగితే ప్రింట్ మీడియాలు, ఎలక్ట్రానిక్ మీడియాలు పనిగట్టుకుని వస్తాయి. చూస్తూ కూర్చుంటే రోజు రోజుకు పరిస్థితి కంటకంగా మారుతుందని ఆఫీసరుకి ఆందోళన కలిగింది. ఫలితంగా పల్లెకు ప్రత్యేక చౌకధరల దుకాణం కేటాయించబడింది. ఆర్డర్ కాగితాలందుకుని పల్లెవాళ్లు తిరుగుముఖం పట్టారు.

◆◆◆

కొత్తగా కోటా వచ్చినతర్వాత సరుకులు సక్రమంగా పంచబడుతున్నాయి. వయసు మీరిన వాళ్లు వేళకింత గంజికాచుకుని తాగుతున్నారు. రోజులు గడుస్తున్నాయి. కోటాదారుడు పురుషోత్తంలో మార్పు వచ్చింది.

"అలా బెల్లం కొట్టిన రాయిలా చూస్తూ కుర్చుంటావేం? పిల్ల పురిటికొచ్చింది. మొదటి కాన్పు ఖర్చు మనమే భరించాలి" శూన్యంలోకి చూస్తున్న పురుషోత్తాన్ని హెచ్చరించింది అతని భార్య.

"అయితే నన్నేం చేయమంటావ్?"

"ఏం చెయ్యమనేదేంది? సాధారణ కాన్పు కాదంట. ఆపరేషన్ చెయ్యాలంట. మొన్న డాక్టరమ్మ చెప్తుంటే విన్లేదా?"

"మనూళ్లో డాక్టరు గారున్నారు కదా! ఇక్కడే చెయ్యొచ్చుగదా?"

"ఛీ! నీ తెలివి తెల్లార. ఎక్కడన్నా మగ డాక్టర్లు కాన్పులు చేస్తారా? ఆడ డాక్టర్లే చెయ్యాల"

'అయితే... " నసిగాడు పురుషోత్తం.

"అయితే లేదు, గియితే లేదు. వేలు గుమ్మరిస్తే గానీ కాన్పు జరగదు"

"మరి...."

"మరిలేదు, గిరిలేదు"

"ఉన్నపళంగా అంత డబ్బు..."

"సరుకు అమ్మేయడమే" మార్గం చూపించింది భార్య.

"అమ్మో...! జనం ఊరుకుంటారా?"

"ఊరుకోకుంటే ఉరేసుకుంటారా? చెప్పింది చెయ్యి" భార్య గయ్యిమంది.

0000

'బాబుగారూ...బాబుగారూ!"

అర్ధరాత్రి పూట అరుపులు విని తలుపు తీశాడు సూర్యం.

పురుషోత్తాన్ని చేతులు వెనక్కికట్టి నడిపించుకొచ్చారు కొందరు యువకులు.

"ఏం జరిగింది?" అడిగాడు సూర్యం.

"తమరు మాకు మంచిబాట చూపించారు. ఆ బాటలోనే నడిచి కోటా తెచ్చుకున్నాం. కొన్నాళ్లు సరుకు సక్రమంగా పంచి, ఇప్పుడు ఆ సరుకంతా లారీలోకి ఎక్కిస్తుంటే పట్టుకొచ్చాం"

"చూడు పురుషోత్తం! మీరెంతో కష్టపడి కోటా సంపాదించుకున్నారు. మరి వచ్చిన సరుకంతా అక్రమంగా తరలిస్తే వీళ్ల బతుకులేం గాను! వీళ్లందరి నోళ్లు కొట్టడానికా నీకు కోటా యిచ్చింది. ఊళ్లో వాళు సక్రమంగా పంచడం లేదని కదా మీరు పోరాటం చేసింది" సూటిగా అడిగాడు సూర్యం.

తల దించుకున్నాడు పురుషోత్తం.

"మీకు అక్షరాలతో పాటు సామాజిక జ్ఞానాన్ని కూడా నేర్పాను. జ్ఞానం సంపాదించిన తర్వాత కూడా మోసాలు చేస్తే ఎలా? సరుకు అక్రమంగా అమ్మి సొమ్ము మూటగట్టుకుంటావు సరే! ఎంతమంది ప్రాణాలు ఆకలితో ఉసూరుమంటాయి? ఒక్కసారి ఆలోచించు. వీళ్లందర్నీ నట్టేట ముంచుతావా? చదువుకున్నందుకు చేసే పని ఇదేనా?" సున్నితంగా అడిగాడు పురుషోత్తాన్ని.

"తప్పయిపోయింది బాబుగారు. ఇంటి ఆడది పోరు చేసింది. పిల్ల కాన్పుకని..." వంచిన తల ఎత్తలేదు పురుషోత్తం.

"అందరికీ బాధలుంటాయి. అయితే ఒక్కరి కోసం ఇంతమందిని బాధించకూడదు. నీ పిల్ల సుఖంకోసం ఎంతమందిని ఇబ్బంది పెడుతున్నావో చూడు. ఇకనుండి సరుకు సక్రమంగా పంచు"

"ఈణ్ణిట్టా వదిలేస్తే ఎట్టాబాబు?" నిలదీశారు యువకులు.

"ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాట్లు చేసి జనాన్ని ఇబ్బంది పెట్టను" సంజాయిషీగా తలపైకెత్తుతూ అన్నాడు పురుషోత్తం.

"పొరపాట్లు జరుగుతుంటాయి. అది మానవ నైజం. అయితే పశ్చాత్తాపమే వాటికి సరైన విరుగుడు. రెండోసారి తప్పు చేయకూడదు"

సూర్యం మాటలకు శాంతించారు యువకులు.

- అచ్చుల



ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక కారణంగా ఒత్తిడికి గురవుతూనే ఉన్నారు. ఒత్తిడిని తట్టుకుని ఎటువంటి ఇబ్బందీ పడకుండా పనులను కొంతమంది నిర్వహించగల్గినా, చాలామందిలో ఇది కొత్త కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. ఈ ఒత్తిడి నుండి బయటపడడం ఎలాగో చూద్దాం.

ఒత్తిడి ఒదలాలంటే...

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

ఒత్తిడి కారణంగా మనిషి ధోరణి (మూడ్) మారిపోతుంది. బాగా ఆకలి వేస్తుంది. గోళ్ళు కొరుకుతారు. తలనొప్పి మొదలవుతుంది. వీటి నుండి విముక్తి పొందితే హాయిగా, సుఖంగా కాలం గడపగల్గుతారు. ఒత్తిడి వల్ల నిరుత్సాహం ఆవరిస్తుంది. ఆలోచనలు పెరిగిపోతాయి. చేసే పని మీద దృష్టి నిలపలేరు. ఇలాంటి స్థితి నుండి బయటపడే మార్గం ఏమిటి?

చేతి మణికట్టుకు ఒక రబ్బరు బ్యాండ్‌ను తగిలించుకుని కొద్దిగా లాగి వదలాలి. దీనివల్ల కలిగే స్పందన ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తుంది. దృష్టి పనిమీద కేంద్రీకృతం అయ్యేందుకు సహకరిస్తుంది.

పొట్ట నిండా గాలిని పీల్చి తర్వాత మెల్లగా వదలాలి. ఇలా తొమ్మిది సార్లు చేయాలి. దీనివల్ల మీలోని ఒత్తిడి ప్రభావం తగ్గి పని కొనసాగించగల్గుతారు.

కొంతమంది ఒత్తిడి వల్ల కుంగిపోతారు. ఈ రెండింటికి లింకు ఏమిటి? ముఖ్యంగా ఆడవాళ్లు కొంతమంది ఒత్తిడికి లోనై ఆత్మీయులను కోల్పోయినట్లు బాధపడుతుంటారు. మగవారికన్నా ఆడవారిలో ఈ ప్రభావం మూడురెట్లు ఎక్కువగా కన్పిస్తుంది.

ఒత్తిడి హార్మోన్లు, స్త్రీ పునరుత్పత్తి హార్మోన్లు కలిసి మెదడులోని కెమిస్ట్రీ తుల్యతను దెబ్బతీస్తాయి. ఫలితంగా కుంగిపోతారు. దీనివల్ల 1. దుఃఖం, నిరాశ, ఏ పనీ చేయలేని అశక్తత, తప్పు చేసిన భావం కలుగుతుంది. 2. విషయాలను గుర్తుతెచ్చుకోవడం కష్టమౌతుంది. 3. అతి నిద్ర లేదా నిద్రలేమి ఉంటాయి. 4. బరువు పెరగడం లేదా తరగడం జరుగుతుంది. 5. సెక్స్ లేదా సంతోషం కల్గించే పనుల్లో ఆసక్తి తగ్గుతుంది. 6. తలనొప్పి లేదా అలసట ఉంటాయి.

పై వాటిలో ఏ ఐదు సమస్యలతోనైనా రెండు వారాలకు మించి బాధపడుతుంటే వైద్యుణ్ణి సంప్రదించాల్సి వస్తుంది. కౌన్సిలింగ్‌తో ఈ సమస్యను పరిష్కరించగల్గుతారు వైద్యులు. దానికీ తగ్గకపోతే ఔషధాలు వాడవలసి వస్తుంది.

కాగితాన్ని చిన్న చిన్న ముక్కలుగా చింపడం వల్ల ఒత్తిడి నుండి బయటపడడం సాధ్యమౌతుందా? 1. కాగితాన్ని చిన్న చిన్న ముక్కలుగా చింపడం వల్ల కొంతమందికి ఒత్తిడి తీవ్రత తగ్గుతుంది. 2. కాగితం చింపడం వల్ల వచ్చే లయబద్ధమైన శబ్దాలు శరీరంలో భౌతికంగా పేరుకున్న శ్రమ నుండి విశ్రాంతినిస్తాయి. 3. కాగితం చేసే శబ్దాలు ఒత్తిడి ప్రపంచం నుండి మరొక ప్రపంచంలోకి తీసుకెళతాయి. 4. కాగితాన్ని ఇలా ముక్కలు ముక్కలుగా చింపిన తర్వాత ఏదో విజయం సాధించిన భావన కలుగుతుంది. అందువల్ల ఒత్తిడి తీవ్రత తగ్గుతుంది.

ఒత్తిడి వల్ల తలనొప్పి వస్తుంది దీనికి విరుగుడు ఎలా? 1. మెదడులో మెగ్నీషియం తగ్గితే రక్తనాళాలు సంకోచిస్తాయి. దానివల్ల తలనొప్పి వస్తుంది. అనుదినం 350 మిల్లీగ్రాముల మెగ్నీషియం తీసుకుంటే సరిపోతుంది. 2. తల, భుజాల దగ్గర కండరాలు ఒత్తిడికి గురికావడం వల్ల కూడా ఈ తలనొప్పి వస్తుంది. వాటికి అనుదినం పదినిమిషాలు 'మసాజ్' చేయించుకోవాలి. 3. నుదుటిమీద, కణత మీద యూకలిప్టస్ నూనె లేదా అమృతాంజనంతో మర్దనా చేసినా తగ్గుతుంది.

ఒత్తిడి సమయంలో గోళ్లు కొరకకుండా ఉండాలంటే? 1. గోళ్ళపొడవు పెరగకుండా కత్తిరించుకోవాలి. 2. గోళ్ళు కొరకాలనే ఆలోచన వచ్చినప్పుడు చేతులతో ఏదో పని చేయడం ప్రారంభించాలి. 3. గోళ్లమీద చేదు పదార్థాన్ని రాయాలి. బాదం కాయ రసం గోళ్లమీద రాస్తే వాసన బాగుంటుంది, కానీ రుచికి చేదుగా ఉంటుంది. దీనితో సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

ఒత్తిడి వల్ల అధికంగా ఆహారం తీసుకుంటారు. దీనివల్ల కొత్తరకం ఒత్తిడికి గురవుతారు. దీనికి పరిష్కారం ఎలా? 1. భోజనం తర్వాత 15 నిమిషాలు కునుకు తీయాలి. ఇది శరీరానికి శక్తిని సమకూర్చి ఒత్తిడి తగ్గిస్తుంది. 2. ఇది సాధ్యం కానప్పుడు ఆకలి వేసినప్పుడు కొవ్వులేని అల్పాహారాన్ని మితంగా తీసుకోవాలి. 3. ఇది తినేటప్పుడు గ్లాసు నిండుగా నీరు, అందులో కొద్దిగా నిమ్మరసం పిండుకుని దగ్గర ఉంచుకోవాలి. నీరు తాగడం వల్ల ఆకలి తగ్గుతుంది. తినాలనే వాంఛ తగ్గుతుంది. 4. ఇటువంటి ఆకలి సమస్య ఎదురవగానే 20 నిమిషాలపాటు కొంచెం వేగంగా నడవాలి. శరీరంలోని బీటా ఎండోర్ఫిన్స్ స్థాయి పెరుగుతుంది. మెదడులోని రసాయనాలు చురుకయి ఆకలిని లేకుండా చేస్తాయి.

భాగస్వామిపై ఒత్తిడి ప్రభావాన్ని చూపకుండా ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? 1. ఎందుకు గట్టిగా అరుస్తున్నారో ముందుగా మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవాలి. 2. 30-45 సంవత్సరాల మధ్యలో వయసు మహిళలు నిరంతరం ఇంటా, బయటా అనేక పనులు నిర్వహిస్తారు. భర్త సహకారం ఉండకపోతే పని ఒత్తిడి ఇంకా పెరుగుతుంది. తల్లిగా, భార్యగా బాధ్యతలు నిర్వహించే ఆమె మరింత ఒత్తిడికి లోనవుతుంది. 3. ఇటువంటి మహిళల సాదకబాధకాలు భర్త వినేందుకు సంసిద్ధుడుగా ఉండాలి. ఆమెకు పనిలో సాయం చేయడంతో పాటు, ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటే ఒత్తిడి నుండి చాలా వరకు విముక్తి లభిస్తుంది.

ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలపై అరవకుండా వారితో ప్రేమగా ఉండాలంటే ఏం చేయాలి? 1. పిల్లలు కంప్యూటర్‌పై ఆటలు ఆడేందుకు నేనంటే నేనని పోట్లాడుకుంటుంటే తల్లిదండ్రులకు చాలా కోపం (ఒత్తిడి కారణంగా) వస్తుంది. 2. ఇలాంటప్పుడు వెంటనే అరవకుండా ఐదారుసార్లు దీర్ఘశ్వాస తీసుకుని నెమ్మదిగా గాలి వదలాలి. 3. ఒకరితో ఒకరు సఖ్యంగా ఉండి సహకరించుకోవాలి. పోట్లాడుకోకూడదని చెప్పాలి. చాలా ఒత్తిడిలో ఉన్నామని పిల్లలతో నెమ్మదిగా, సూటిగా చెప్పాలి. 4. నిన్న కంప్యూటర్ మీద తమ్ముడు ముందు ఆడాడు. ఈ రోజు నేను ఆడతాను అనొచ్చు. ఇద్దరికీ నచ్చజెప్పాలి. వారిమీద అరవకూడదు. కోపంతో రెచ్చిపోయి శిక్షించకూడదు. 5. ఎంత ఒత్తిడికి గురైనా దాని ప్రభావం ఇంట్లో కుటుంబ సభ్యులపై పడకుండా జాగ్రత్తగా ఉండాలని, ముందు మనసుకు గట్టిగా చెప్పుకోవాలి. అప్పుడు ప్రశాంతంగా ఉండగల్గుతారు.

★

కొత్త పుస్తకాలు

ప్రయోగాత్మక నవల



కవి ప్రాణ్‌రావ్ అనగానే మనకు 'మా భూమి, కొమరం భీం, రంగుల కల, మట్టి మనుషులు' చిత్రాలు గుర్తొస్తాయి. వీటి రచయిత ఆయనే. నవలా రచనలో పట్టు వున్న ప్రాణ్‌రావ్ గతంలో 'నీలి పాప, డ్రీంబోయ్ (పిల్లల నవల), నీటి నీడ, నీలాంబరి, సిరులయ్య' రాశారు. పాఠకుల అభిమానం పొందారు. 'శరీరం మగది – మనసు ఆడది' అదే మీరైతే ఎలా స్పందిస్తారు? అంటూ నిఖిలేశ్వర్ ముందు మాటలోనే పాఠకుణ్ని నవలలోకి తీసుకెళతారు. ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణను 'మయూర్' పాత్రలో చూపారా? అన్నట్లు ఈ నవల సాగుతుంది. కొజ్జాలనబడే (ఆడ, మగ కాని వ్యక్తులు) బలమైన సామాజిక వర్గం ఉత్తరాదిన ఎక్కువగా ఉండడంతో వీరిపై హిందీలో నాటకాలు, సినిమాలు... నవలలు వచ్చాయి. కుష్వంత్ సింగ్ రాసిన 'ఢిల్లీ', నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వారు ప్రదర్శించిన 'కిన్నర్' నాటకం, కల్పనా లాజ్మి నిర్మించిన 'దర్మియా' చిత్రం తీశారు. ఈ నవల పరంగా చూస్తే ఒక మర్యాదస్తుల కుటుంబంలో ఆడంగి లక్షణాలతో పుట్టి ఇంటా బైటా ఈసడింపులు, అవమానాలు పడే 'మయూర్' అనే నపుంసక యువకుడి జీవితం చుట్టూ జరిగిన సంఘటనలు... అతడు పడ్డ మానసిక వేదన, బాధలు, అణచివేత భాషాపరంగా సహజ శైలిలో రచయిత (ఎక్కడా అశ్లీలానికి తావులేకుండా) చక్కగా రాశారు. మయూర్ తాతయ్య, ప్రిన్సిపాల్, సమ వయస్కురాలైన మేఘన సహకారం ఈ నవలలో హైలెట్‌గా ఆ పాత్రల్ని తీర్చిదిద్దారు. ఎప్పుడో 1970ల్లో డా॥లత ఈ తృతీయ ప్రకృతిపై ఒక నవల రాశారు. కొజ్జాల్లో కూడా మానవతావాదులు వుంటారని రచయిత ఈ నవల ద్వారా చెప్పారు. గురజాడ సృష్టించిన సౌజన్యరావు పాత్ర(కన్యాశుల్కంలో)ను జ్ఞప్తికి తెస్తుంది సోమశేఖరం పాత్ర. "ఈ నవల్లో "అమ్మతనం, ఆదరణ, ఇజ్జత్, ఈక్వాలిటీ' మానవ సమాజ పందిరికి నాలుగు మూల స్తంభాలు. ఇవి ఎంత కొద్ది పరిమాణంలో ఉన్నా ఈ సమాజ నిర్మాణం కుప్ప కూలకుండా కాపాడతాయి" అంటూ తన సంస్థ 'అ,ఆ,ఇ,ఈ' లక్ష్యాలను సోమశేఖర్ పాత్రతో చెప్పించేందుకు రచయిత చేసిన ప్రయత్నం ఓ వినూత్న ప్రయోగం. ఇది ఓ సైకాలజీ నవలగా నిలుస్తుంది.

పురి విప్పిన నెమలి,-ఎస్.ఎమ్.ప్రాణ్‌రావ్, పేజీలు : 112, వెల : 40/-, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్ నగర్, మలక్‌పేట, హైదరాబాద్ - 5000036.

- తంగిరాల చక్రవర్తి

ఆలోచింపచేసే నాటికలు

ఇప్పుడంటే లేదుకానీ, నాడు నాటికలంటే విపరీతమైన ఆదరణ, మన్నన. ప్రజల మధ్య పుట్టి, ప్రజల్లోకి చొచ్చుకుపోయిన కళ 'నాటిక'. నేడు సినిమాలు, చానళ్ల మధ్య నాటకం మసకబారినా, దానిపట్ల అదే గౌరవం కొనసాగుతోంది. భావాలను, అభినయాన్ని మెరుగుపరుచుకునే అవకాశం సినిమాలకు, ఛానళ్లకు లేదు... కేవలం నాటికలకే ఆ వెసులుబాటు. ఇప్పుడంటే నటనలో ఓనమాలు తెలియనివారంతా 'నటులైపోతున్నారు కానీ, నాడు నాటకరంగంలో ప్రావీణ్యులైనవారే సినీరంగాన రాజ్యమేలారు. అంతటి విశిష్టత కలిగి, నేడు కనుమరుగవుతున్న నాటికలను వై. శ్రీరాములు పుస్తకరూపంలో తీసుకొచ్చారు. చదువరులను ఇబ్బందిపెట్టని భాష ఈ నాటికలు చదవడానికి తోడ్పడింది. ఈ పుస్తకంలో మూడు నాటికలున్నాయి. ప్రతి నాటికముందూ వాటి నేపథ్యం, ప్రేరేపించిన కారణాలు రచయిత పొందుపరిచారు. సీమప్రాంతపు గ్రామీణ వాతావరణం మూడు నాటికల కథాంశాలు. అక్కడి పేదరికం, రైతుల కడగండ్లు, అప్పుల ఆక్రోశాలు, రాజకీయనాయకుల కుయుక్తులు, దానికి బలయ్యే పేదలు, కాగితాల్లో తప్ప ప్రయోజనాన్ని చేకూర్చని ప్రభుత్వ పథకాలు... ఇవన్నీ మూడు నాటికల ముడిసరుకు. మూడు వీటిలో మనల్ని ఆకట్టుకునేది 'మందుకొట్టు' నాటిక. పంటపండక, ప్రభుత్వ సాయం కోసం బక్కచిక్కిన రైతు ఎదురుచూపులు, ప్రాణాలు తీసుకునే నిస్సహాయపు బతుకులు, రైతులనోట మట్టికొట్టి బొజ్జలు నింపుకునే రాజకీయ నాయకులు... మొత్తంగా తాగుబోతు నోట చెప్పించినవన్నీ అక్షరసత్యాలే! 'ఒక్క కోతి రెండు పిల్లులు' నాటిక గ్రామాల్లోని విద్వేషాలను సొమ్ము చేసుకునే రాజకీయ మంత్రాంగాలు. 'ఒక్కసారే' సమస్యలతో సతమతమై క్షణ క్షణం చచ్చే సామాన్య మానవుని భయాలకు రూపం. అయితే, సాదాసీదాగా సాగిపోతుంది. ప్రయత్నం మెచ్చుకోదగ్గదే అయినా, రూపకల్పనలో మరికొంచెం శ్రద్ధ వహించివుంటే బాగుండేది.

నా సీమ నాటికలు - వై. శ్రీరాములు, ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రాలు.

- కె.అరుణ



కరుణశ్రీ సాహిత్యం - 2

డా॥ జంధ్యాల పాపయ్య శాస్త్రి,
వెల : 200/-,
పేజీలు : 376,
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాద్-001, మరియు అన్ని విశాలాంధ్ర బ్రాంచీలు.

వసంత సాహితి

ఖండకావ్య సందోహము
శ్రీమతి పిండిప్రోలు వసంతకుమారీ దేవి,
వెల : 100/-, పేజీలు : 396,
ప్రతులకు :
శ్రీమతి కోగంటి వెంకట రంగనాయకి
శ్రీ సీతారామ సదనం,
డోర్ నెం.26-32-26,
ఇంటి.నెం.189, 6వ లైను చివర,
ఏ.టి. అగ్రహారం, గుంటూరు.



ఎవరి గోల వారిదే

ఇరవై ఏళ్లలో ఎంత మార్పు!!



ఎలాంటి వాళ్లం ఎలా అయ్యాం ! ఒకప్పుడు ప్రపంచానికంతటికీ సరఫరా చేసిన వాళ్లం ఇప్పుడు మనమే మరొక దేశం నుంచి కొనుక్కోవాల్సి వస్తోంది ! ఖర్మ ఖర్మ... ఓడలు బళ్లు,బళ్లు ఓడలు కావటం గురించి 'అప్పుడు' ఊహించలేకపోయాం ! ఆ రోజులే వేరు, దర్జాగా మనం తయారు చేసిన వస్తువులను మనమే అమ్ముకొనే వాళ్లం, ఇప్పుడు దుకాణ యజమానుల దయాదాక్షిణ్యాలకు అర్రులు చాస్తున్నాం ! ఇదీ నేటి రష్యన్ల 'గొడవ'. ఇరవై సంవత్సరాల క్రితం మాస్కోలోని ఇజమైలోవస్కీ పార్కులో హస్తకళాకారులు, అపురూప వస్తు సేకరణదారులు వారాంతాల్లో చేరి తమ వస్తువులను విదేశీయులకు విక్రయించి ఆనందంగా గడిపేవారు. ఇప్పుడో....అలా అమ్ముకొనే అవకాశాలు లేవు, తమ స్థానాలను 'వ్యాపారులు' ఆక్రమించారు. ఆరోజుల్లో ఒక మత్రోయిష్కా (బొమ్మ)ను విక్రయిస్తే ఒక నెల గడిచేది... ఇపుడా పరిస్థితి లేదు. పుతిన్ కంటే ఏరోజైనా లెనిన్ బొమ్మలకే విలువ ఎక్కువ, అమ్ముడుపోతున్నాయని నిట్టూర్చుతున్న అలెక్సీలెందరో. పూర్తి పేరు కనుక బయటకు వస్తే ఉన్న అవకాశాలు కూడా 'పోతాయని' భయపడుతున్న, పెట్టుబడిదారీ మబ్బుల్ని చూసి సోషలిస్టు ముంతలో నీళ్లు ఒలకబోసుకున్న సగటు రష్యన్ 'స్వేచ్ఛా' జీవి. వ్యాపారంలో పోటీ, అన్నీ నకిలీ, దానికి తోడు చైనా, ఐరోపా దేశాల నుంచి కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్న వస్తువులు. స్థానిక వస్తువులను కొనేవారే లేరు. చివరకు లెనిన్, సుత్తీకొడవలి, ఎర్రజెండా బొమ్మలు కూడా చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి.

'టాబ్' కొన్నావా ?

కారు గాని కారేందంటే పట్టుకారన్నాడు, కప్‌గాని కప్పంటే చెకప్, బారు కాని బారంటే చాకోబార్ అంటే నే కాదన్నానా? కాని 'విండోస్' అంటే కిటికీలు కావని, 'మౌస్' అంటే ఎలుక కాదని, 'చిప్స్' అంటే బంగాళాదుంపలు, అరటి కాయలతో చేసేవి కాదని 'ఎంతచెప్పి'నా అర్ధం చేసుకోవటం లేదని ఎవరైనా అంటే వాళ్లను 'తప్పు' పట్టకూడదు మరి ఈ రోజుల్లో. ఎందుకంటే కాలం, మనుషులతో పాటు మనమూ మారాలి. ఏరా 'టాబ్‌లెట్' లేదా 'టాబ్' కొన్నావా అని కుర్రాళ్లు ఎవరైనా మాట్లాడుకొంటుంటే ఇదేంట్రా బాబూ ఈ వయస్సులోనే వీరికి మందులతో పనేమిటి అనుకోకండి. గతంలో ప్రామిస్ అని చెప్పేవాళ్లం ఇప్పుడు 'ప్రామ్' అంటున్నారు. ఇలాగే ఎన్నో, అందుకే ఎలా చెప్పాలో తెలియటంలా... బుజ్జి కంప్యూటర్ అనుకోండి. దీనిలో మాట్లాడటానికి 'ఫోన్', ఫొటోలు తీసేందుకు 'కెమెరా', వినేందుకు, చూసేందుకు 'పాటలు', ఆడుకొనేందుకు 'ఆటలు', చదువుకొనేందుకు 'పుస్తకాలు', చేసుకొనేందుకు 'టైప్', పంపుకొనేందుకు ఇమెయిల్ దారి తప్పితే చూసుకొనేందుకు 'మ్యాప్' ఇలా ఎన్నని చెప్పమంటారు, ఇన్ని సౌకర్యాలతో మన చేతిలో ఇమిడే లేదా మా తాతయ్య పెట్టించుకున్నంతటి 'పెద్ద జేబు'లో పట్టేంతటిది ఇది. కొని చూడవలసిందేగాని దీని తస్సదియ్యా చెప్పనలవి కాదు.

మన జనానికి జలుబు చేస్తే, జ్వరమొస్తే 'టాబ్లెట్'లు దొరకని ప్రాంతాలు, ప్రకృతి అవసరాలకు మరుగుదొడ్లు లేని ఇళ్లు మన దేశంలో ఎక్కడబడితే అక్కడ ఉన్నాయిగాని 'సెల్‌ఫోన్'లేని ఇల్లును వెతకటం అంత 'వీజీ' కాదని స్వయంగా గతేడాదే 'ఐక్యరాజ్యసమితి' చెప్పింది. ఇప్పుడు 'కంప్యూటర్' కూడా వచ్చి చేరింది. ప్రతి పాతిక మంది జనాభాకు ఒక కంప్యూటర్(5.2కోట్లు) మన దేశంలో ఉన్నాయట. ఐటి రంగంలో ముందున్నామని చెప్పుకొనే దేశంలో ఇంత తక్కువ ఉన్నాయని చెప్పుకోవటం కొందరికి 'సిగ్గుచేటు'గా ఉందట. దేశంలో ప్రతి సెకనుకు ఒక మరుగుదొడ్డి నిర్మించినా 2015 నాటికి 'సహస్రాబ్ది లక్ష్యాన్ని' చేరుకోలేనంత వెనుకబడి ఉన్నామని మరికొందరంటున్నారు. నిజానికి దేనికి సిగ్గుపడాలి? ప్రపంచంలో రోడ్లపై 'చెంబు షికారు' చేసేవారు గతేడాది 110 కోట్ల మందయితే ఎంతో 'పురోగతి'లో ఉన్నామని చెప్పకుంటున్న మన దేశంలోనే ప్రతి ఉదయం 68.3కోట్ల చెంబులు బయటకు వస్తాయట. అంటే ప్రతి సెకనుకు ఒకరు... మిన్నువిరిగి మీద పడుతున్నా, లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగినా 'మౌనమే నాభాష ఓ దేశ ప్రజా' అన్నట్లు ఉండే మన ప్రధాని మన్మోహన్ సింగ్ ఏటా సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమం కింద 15లక్షల మరుగుదొడ్లు కడుతున్నా వాటిలో సగాన్ని వినియోగించటంలేదని మూడేళ్ల క్రితమే 'నోరు విప్పారు'. ఇంటికి గొళ్లెం మరిచి తాళం వేసినట్లు నీళ్లు లేకుండా మరుగుదొడ్లు ఎన్నికట్టినా ప్రయోజనం ఏముంది !!

మెల్‌గిబ్సన్ 'లెథల్‌వెపన్' ఒకసానా

మాడ్‌మాక్స్, బ్రేవ్‌హార్ట్, లెథల్ వెపన్ సినిమాల హీరో పేరు వినే ఉండి ఉంటారు, మెల్‌గిబ్సన్, యాభై ఐదు సంవత్సరాల ఈ హాలీవుడ్ నటుడు తన మాజీ 'స్నేహితురాలిని' వదిలించుకోవటానికి భారీ మూల్యమే చెల్లించేందుకు 'ఒప్పందం' చేసుకున్నాడు. ఒకసానా గ్రిగోరియేవా (41) అనే గాయనితో ఐదు సంవత్సరాల పాటు 'సహజీవనం' చేసి లూసియా అనే ఒక పాపను కూడా కన్నారు. 'సరదా' తీరిన తరువాత గతేడాది విడాకులు తీసుకున్నారు. అందుకుగాను భరణంగా ఏడున్నరలక్షల డాలర్లు గిబ్సన్ చెల్లించేట్లు, లాస్‌ఏంజల్స్ నగరంలోని ఒక ఇల్లు ఇచ్చేట్లు ఒప్పందం చేసుకున్నాడు. అయితే తమ బంధం, సంబంధాల 'గ్రంథా'లు రాయకూడదని, వాటి గురించి ఎవరితోనూ మాట్లాడకూడదని కూడా రాసుకున్నారు.

- ఎం. కోటేశ్వరరావు

నిజమైన స్నేహం

ఒకసారి ఓ చీమ కాలువ ఒడ్డున వెళ్తూ జారి అందులో పడిపోయింది. ఒడ్డుకు చేరుకోవడానికి విశ్వప్రయత్నం చేసింది. కానీ ఆ ప్రవాహ ఒరవడికి కొట్టుకుపోసాగింది. అక్కడే చెట్టుమీద వున్న ఒక పావురం అదంతా చూసి ఒక ఆకు తెంపి దగ్గరగా వెళ్లి దానిముందు వదిలిపెట్టింది. ఆ చీమ అతి కష్టంమీద ఆ ఆకు మీదికి ఎక్కి ప్రాణాలు కాపాడుకుంది. అప్పటి నుండి ఆ రెండూ మంచి స్నేహితులయ్యాయి. కలిసి మెలిసి, ఆడుతూ పాడుతూ, తింటూ తిరుగుతూ హాయిగా వుండసాగాయి.

అలా వుండగా ఒకసారి ఓ వేటగాడు అడవిలోకి వచ్చి చెట్టుమీది పావురాన్ని చూసి, దాన్ని చంపడానికి తుపాకి ఎక్కుపెట్టాడు. తన మిత్రునికి కలగబోయే ఆపదను గుర్తించిన చీమ ఆ వేటగాని కాలిమీద కుట్టింది. వాడు అబ్బా అని కిందికి చూసేటప్పటికి తుపాకి గురి తప్పింది. తుపాకి మోగిన శబ్దానికి పావురం అక్కడి నుండి ఎగిరిపోయింది. ఆ తర్వాత చీమ, పావురం అడవి లోపల చాలా దూరంగా, సురక్షిత ప్రదేశానికి వెళ్లిపోయాయి.

నీతి : మనం ఇతరులకు సాయం చేస్తే మనకు ఎవరైనా సహాయం చేస్తారు.

- మేకల మదన్‌మోహన్



వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?



చెప్పుకోండి

హాయ్... పక్కనున్న 'అల్లరి' పిడుగు ఎవరో తెలుసా? మీకు చిన్న క్లూ. ఇతనో తెలుగు హీరో. అంతేకాదు. ఓ దర్శకుని కొడుకు కూడా. తొలి సినిమాతోనే తెగ 'అల్లరి' చేశాడు. ఇప్పుడు చెప్పండి ఇతను ఎవరో?

జవాబు : అల్లరి నరేష్

తమాషా ప్రశ్నలు

1. పావుశేరు పాలల్లో పాలెన్ని?
2. అరచేతిలో అరవై తూట్లు. ఏంటది?
3. వక్కలవంగం ఇద్దరు ఎలా పంచుకోవాలి?
4. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఎదురుగా ఒకాయన వచ్చి మీరిద్దరు ఒకరికి ఒకరు ఏమౌతారు అని అడిగాడు. అప్పుడు ఆ అమ్మాయి 'వీళ్ల మామ మా మామని మామా అని పిలుస్తాడు' అంది. ఇంతకీ ఆ అమ్మాయికి అబ్బాయి ఏమౌతాడు?
5. పచ్చపచ్చగా ఉంటుంది. నిండుగా ఉంటుంది. రాజుగారి తోటలో తలారబెట్టుకుంటుంది. ఏంటది?

- సుమేరా ఫిర్దోజ్, 8వ తరగతి, గురుకుల విద్యాపీఠ్, ఇబ్రహీంపట్నం.

మీరూ ఇలా 5 తమాషా ప్రశ్నలు, జవాబులు రాసి పంపండి. ప్రచురిస్తాం.
మా చిరునామా : తమాషా ప్రశ్నలు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

జవాబులు : 1.రెండు ('పా' లు రెండు), 2. విస్తరాకు, 3. వక్క ఒకరు, లవంగం ఒకరు పంచుకోవాలి, 4. కొడుకవుతాడు. (ఇద్దరూ తల్లీ కొడుకులు అవుతారు.), 5. మొక్కజొన్న పొత్తు

9 తేడాలు ఏవి?

పిడుగులూ! పక్కనున్న రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నాయి. అయితే అందులో 9 తేడాలున్నాయి. వాటిని గుర్తించండి.



ఎ. ఉదయ్ రాజ్,
2వ తరగతి,
వశిష్టా మోడల్ హైస్కూల్,
రామాంతపూర్,
హైదరాబాద్.

దారి ఏది?

చిన్నారులూ...! చంటి ఆడుకోడానికి బంటి దగ్గరికి వెళ్దామనుకున్నాడు. అక్కడికెళ్లాలంటే మధ్యలో గజిబిజి దారులున్నాయి. వాటిలో ఏ దారిగుండా వెళ్తే త్వరగా బంటిని చేరుకోగలడో చెప్పండి.



కనిపెడతారా!

నేస్తాలూ...కింది బొమ్మలో కొన్ని వస్తువులు, తినుబండారాలు, పక్షులు, జంతువులు ఉన్నాయి.అవి ఎక్కడున్నాయో వెతికి పట్టుకోవాలి. వాటిలో ఎన్ని ఎక్కువ వెతికి పట్టుకుంటే అన్ని మార్కులు వచ్చినట్లు. మరి త్వరపడండీ!

మునుగు కోడి

ఈ వారం మనం చెప్పకోబోయే పక్షి పేరు మునుగు కోడి. ఇది చాలా బలంగా మట్టిరంగులో ఉంటుంది. దీనికి తోక ఉండదు. కింది భాగం పట్టులా మెత్తగా, మెరుస్తుంది. చిన్న చిన్న చెరువుల్లో ఈదుతూ కనిపిస్తుంది. పెద్ద పెద్ద చెరువుల్లోనైతే 50 నుండి 60 పక్షుల వరకు గుంపుగా ఉంటాయి. ఆపద ఉందనిపిస్తే క్షణాల్లో నీటిలో మునిగిపోతుంది. నీళ్లలో ఉండడమంటే చాలా ఇష్టం. అది కూడా సగం శరీరం నీటిలో, మిగతా సగం శరీరం నీటిపైన ఉంటుంది. దీనికి రెక్కలు చిన్నగా ఉంటాయి. ఐనా కూడా చెరువు ఎండిపోతే మరో చెరువు దగ్గరికి ఎంత దూరమైనా సునాయాసంగా ఎగురుకుంటూ పోతుంది. నీళ్లలో ఉండే కీటకాలు, చిరు కప్పలు, లార్వాలు, నత్తలు, చిన్న చేపలను ఆహారంగా తీసుకుంటుంది. గుడ్లుపెట్టే సమయంలో దీని తల, మెడ ముదురు గోధుమ రంగులోకి, నోరు పసుపు రంగులోకి మారుతుంది. నీటిపై తేలుతున్న మొక్కలపైనే గూడు కట్టుకుంటుంది.



మాటల కోట - 69

రూపకల్పన : కర్లపాలెం

1	2		3		4	■	5	6
■		■		■		■	■	
■		■		■	7		8	
9		■		■		■	10	
11		12	■	■	■	13		
	■	14	15	16	■		■	■
17	18	■	19		20		■	21
22		23				■	24	
	■		■		■	25		

అడ్డం :

1. అక్టోబర్‌లో వచ్చే దసరా పండుగ (6)
5. సీతారామయ్య గారి మనుమరాలు (2)
7. చెదిరిపోయిన యాచకుడు (4)
9. సగం రంగారావు (2)
10. మల్లియ...!, మాలిక...!, మౌనముగా ఉన్నారా? (2)
11. నునుపు కాదు (3)
13. ఆ సామీ యజమానే (3)
14. చెదరగొట్టిన కంకణం (3)
17. యమగోల అయినా యమలీల అయినా ఈయనదే (2)
19. యక్షిణులు, గంధర్వులు, ... (4)
22. అన్ని రకాలు కలగలిసిపోయిన గంప (6)
24. కోకోకోలాని ఇలా కూడా అంటారు (2)
25. ఇటీవల పార్లమెంటు సభాహక్కుల తీర్మానం వల్ల వార్తల్లో కెక్కిన హిందీనటుడు (3)

నిలువు :

2. గౌరవంగా జగ్గయ్య (5)
3. దయగలవాడు (4)
4. మిరపకాయలకు బదులు కారానికి వాడేవి (4)
6. పెళ్లిలో వరుడు వధువుకు చేసే ప్రమాణం (5)
8. పరిచితులు ఎదురయితే విచారించేది దీని గురించే (3)
9. జానకికి విముక్తి కలిగించిన తెలుగు రచయిత్రి (6)
12. కింద నుంచి కంకు (2)
13. మిరియాలకు జంట పదం (3)
15. చెదిరిన వెలుగురేఖ (3)
16. స్వాతంత్ర్యయోధుడు హనుమంతు ఇంటిపేరు (4)
18. తిరుమలలోని కొండ (2)
20. తలాతోకా లేని 'నరపతి' (2)
21. ఉరిశిక్ష అమలు చేసేవాడు (3)
23. కూడు, గుడ్డ తర్వాత మనిషి ఆలోచించేది దీని గురించే (2)
24. పదునైన అంచు (2)

మాటలకోట - 68 జవాబు

1 ప	గ్గం	■	2 ఉ	■	3 అ	4 నా	థ	■
శ్రీ	■	5 అ	గ్గ	6 వ	■	ణెం	■	7 ము
8 మ	హా	■	■	9 ద	10 శ	■	11 అం	బా
బం	■	12 నీ	13 రో	■	త	■	14 ధ	ర
గ	■	■	క	■	■	15 పా	■	క్
■	■	16 క	లి	17 మి	లే	ము	లు	■
18 రా	ట్నం	■	■	రా	■	ని	■	19 మా
ధి	■	20 జు	21 లా	యి	■	22 చ్చె	నె	లి
23 క	త్తి	■	వు	■	24 కూ	న	■	క్

తెలివిగల జవాబు

ఉద్యోగ దరఖాస్తులలో అడిగే ప్రశ్నలు అందరికీ ఒకే విధంగా ఉంటాయి. ఎవరికి వారు తమకు వర్తించే వాటికి మాత్రమే రాసి మిగతా వాటిని కొట్టి వేయాలి. అయితే ఒక అతి తెలివి గలవాడు ఇలా రాశాడు.

హ్హా... హ్హా...

ఒక ప్రశ్నలో 'నీవెప్పుడైనా అరెస్టయ్యావా?' అంటే లేదు అని నింపాడు.

దానికింద 'ఎందుకు?' అన్న మరో ప్రశ్నకు ఏదో ఒక సమాధానం రాస్తే మంచిదని 'ఎప్పుడూ పట్టుబడలేదు కనుక' అని రాశాడు.

\- సత్య

రాయల హృదయం

గజదొంగ వీరమల్లు తన కొడుక్కి గంగయ్య కూతురితో అడవిలో పెళ్లి చేయసాగాడు. బ్రాహ్మణుడ్ని ఒకరోజు ముందే పట్టుకొచ్చారు. మేళం ఉంటేనే పెళ్లి జరిగినట్లుంటుందని పక్క గ్రామం నుండి బాజాభజంత్రీ వాయించేవాళ్లను తీసుకురావడానికి అతని అనుచరులు కదిలారు. మేళగాళ్లు కొందరు మొదటిసారి వెంకటేశ్వరస్వామి కళ్యాణానికి వాయిస్తామని మొక్కుకుని, అదే దారిలో తిరుపతి వెళ్తున్నారు. వెదకబోయిన తీగ కాలికే తగిలిందనుకుని, వాళ్లకి కత్తులు చూపించి, బెదిరించి లాక్కొచ్చారు.

వాళ్లు ముందు భయపడ్డా 'ఏదైనా పెళ్లేకదా' అనుకుని భజంత్రీలు మోగించసాగారు.

వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని చూద్దామని అదే దారిలో బయల్దేరిన శ్రీకృష్ణదేవరాయలుకు నట్టడవిలోకి వచ్చేసరికి ఏదో వేడుక జరుగుతున్న శబ్దం వినిపించింది. ఇక్కడ పెళ్లి సంబరాలా? లేక ఎవరన్నా గ్రామ దేవతకు నైవేద్యం పెడుతున్నారా? వెళ్లి చూద్దామని మందీ మార్బలంతో గూడేనికి వెళ్లారు. హఠాత్తుగా సైన్యంతో కనిపించిన రాజును చూసేసరికి దొంగలు భయపడి పారిపోడానికి ఉద్యుక్తులయ్యారు. పీటలమీదున్న పెళ్లి కొడుకు కూడా భయంతో లేచి నిలబడ్డాడు.

"శుభకార్యం జరగనివ్వండి. పెళ్లింట అశుభం జరక్కూడదు" అని అక్కడే ఉన్న ఆసనం మీద కూర్చున్నారు రాయలు.

వీరమల్లుకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినంత పనైంది. "హమ్మయ్య. ఇప్పటికైతే ప్రాణాలు నిలిచాయి. ముందు ముందు ఏం జరగనుందో?" అనుకుంటూ కొడుక్కి సైగ చేశాడు. పెళ్లికొడుకు రణమల్లు పెళ్లికూతురు మెడలో తాళి కట్టాడు. రాయలవారు, పక్కనున్న సిబ్బంది కూడా అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నూతన దంపతులు రాయలవారి పాదాలకు నమస్కరించారు.

"చోరవృత్తి మాని, వీరునిగా పిల్లాపాపలతో జీవించు" అని తన మెడలో ఉన్న హారాన్ని వధువుకు కానుకగా ఇచ్చి ఆశీర్వదించారు రాయలు. వీరమల్లు అభ్యర్థన మేరకు పరివారంతో కలిసి విందు భోజనం చేశారు.

తర్వాత వారి వద్ద సెలవు తీసుకుని శ్రీనివాసుని కళ్యాణానికి తిరుపతి ప్రయాణమయ్యాడు. వారి వెంట మేళగాళ్లు కూడా బయల్దేరారు.

"అనవసరంగా వదిలేశారు ప్రభూ. వీడు అనేక దొంగతనాలు, దారిదోపిడీలు చేసిన సంగతి మీకు తెలియంది కాదు. మళ్లీ మన చేతికి దొరక్కపోవచ్చు. మనం చూశాం కనుక వాళ్లు రేపేపాటికి గూడెం కూడా ఖాళీ చేయొచ్చు. మీరు సైగ చేసి వుంటే శిక్షించేవాళ్లం" అన్నాడు దళపతి నందయ్య.

"వధూవరులు సంతోషంగా పెళ్లి చేసుకుంటున్నారు. అందరూ ఆనందంతో తిరుగుతున్న పెళ్లి మండపంలో రక్తం చిందటం మంచిది కాదు. ఓ మూడు రోజులు ఆగి చూద్దాం. అప్పటికీ మారకుంటే నువ్వే సైన్యంతో వెళ్లి బంధించి తీసుకొద్దువులే. ఎక్కడికి పోతాడు?" అన్నారు రాయలవారు.

ఆ రాత్రి స్వామి వారి కళ్యాణం చూసి, తన రాజభవనానికి తిరిగొచ్చారు శ్రీకృష్ణదేవరాయలు. మరుసటి రోజు సభామండపంలో పాలనా వ్యవహారాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇంతలో వీరమల్లు వచ్చి తన కత్తిని రాయలవారి పాదాల ముందు ఉంచి "ఇంతకాలం చేసిన నేరాలకు మీరు ఏ శిక్ష విధించినా భరించడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు తలవంచి నిలబడి.

"ఎన్నో ఏళ్లుగా చోర వృత్తి మీద బతికిన వాడివి. అకస్మాత్తుగా మనసు ఎందుకు మార్చుకున్నావు మల్లూ" అడిగారు శాంతంగా.

"ప్రభూ! పెళ్లిరోజున మీరు తలచుకుంటే మేమంతా హతమయ్యేవాళ్లం. కొత్త దంపతుల మీద ప్రేమతో, పెద్దమనసుతో ఎవరినీ ఏమనకుండా, వియ్యాలవారి ముందు నా పరువు కాపాడారు. మా ఆత్మీయ బంధువులా అక్షింతలు వేసి ఆశీర్వదించి కానుకలిచ్చారు. అలాంటి మహోన్నత గుణం కలిగిన మీ రాజ్యంలో ఇంక దొంగతనం చేయడానికి నా మనసు అంగీకరించడం లేదు. గతంలో దొంగగా బతికినందుకు సిగ్గుపడుతున్నాను. ఇకపై మీ ఆజ్ఞ" అన్నాడు మల్లు.

రాయలవారు కొద్ది నిమిషాలు ఏం మాట్లాడలేదు. సభాప్రాంగణమంతా ఏం జరగబోతోందా? అని ఊపిరి ఉగ్గబట్టి చూస్తోంది.

ఓ చిరునవ్వు నవ్వి "మంచితనం, పశ్చాత్తాపం అనేవి గొప్ప సుగుణాలు. ఎవరివద్దనున్నా అవి పరిమళిస్తాయి. నిన్నేకాదు, మీ వాళ్లందర్నీ క్షమిస్తున్నాను. రేపు నీ కొడుకుతో సహా అందరూ రండి. తలెత్తుకుని ధైర్యంగా జీవించేలా నేను చేస్తాను" అన్నారు శ్రీకృష్ణదేవరాయలు.

సంతోషంతో వీరమల్లు కళ్లనుండి ఆనందభాష్పాలు రాలాయి. రాజు పాదాలకు నమస్కరించి నిండు గుండెతో తన గూడేనికి వెళ్లాడు. రాజ కొలువులో జరిగిన సంభాషణంతా తనవారికి చెప్పాడు. మగవాళ్లు కొంతమంది వ్యతిరేకించినా, ఆడవాళ్లంతా "ఈ దొంగబతుకులొద్దు. మన పిల్లలైనా గౌరవంగా బతకాలి. రాజుగారు చెప్పినట్లు చేద్దాం" అని భర్తల్ని ఒప్పించారు.

మరునాడు తన ముందు నిలబడ్డ వీరమల్లు, అతని గూడెం వారందర్నీ గ్రామల్లో కాపలా భటులుగానూ, సైనికులుగానూ నియమించుకున్నారు రాయలువారు.

- పుప్పాల కృష్ణమూర్తి

వెరై'టీ'



'పొద్దున్నే పొగలు కక్కే టీ వంపుకొని చప్పరిస్తుంటే ఎలా వుంటుంది?! బద్ధకం, నీరసం వంటివి ఏమైనా వుంటే 'హుష్ కాకి' అవ్వవూ! హుషారుగా పనిలోకి దిగిపోమూ!! మనలో అంత హుషారు నింపే టీ జార్లు వెరైటీగా వుంటే మరింత బావుంటుంది కదూ. ఇవిగో మీ ముందుకొచ్చినవన్నీ అలాంటివే. ఇంక్‌బుడ్డి, పుస్తకాలు, బ్యాగ్లు, డబుల్ డెక్కర్ బస్సు, కంప్యూటర్, టాయ్‌లెట్, పోస్ట్‌డబ్బా, ఫోన్ బూత్, కారు, సెల్‌ఫోన్, సోఫాసెట్... లాగా కనిపించేవన్నీ అవే. ఏంటీ ఇవి టీ జార్లా అనిపించినా ఆశ్చర్యం లేదు. కానీ నమ్మక తప్పదు. ఎందుకంటే కళ్ల ముందే వున్నాయిగా!